ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 81 పేజీలు: 12 వెల: 6.50

అమెరికా ట్యారిఫ్ రిఫండ్‌లతో భారత్‌కు 12 బిలియన్ డాలర్లు రాక 2లో

నకిలీ కెవైసితో రూ.2కోట్లు పైగా లూటీ

## కేంద్రం చెప్పినదే సరైన 'డీలిమిటేషన్'

### మహిళా బిల్లును ఓడించి దక్షిణాదికి అన్యాయం చేసిన రాహుల్, స్టాలిన్

### ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వవైభవం

### నప్రధానికి మేం పూర్తి మద్దతు ఇస్తున్నాం

### ఆంధ్ర, తమిళ ప్రజలది సోదర బంధం: ఎపి సిఎం చంద్రబాబు నాయుడు



మంగళవారం చెన్నైలో మీడియాతో మాట్లాదుతున్న ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు పీయూష్‌గోయల్, కింజరాపు రామ్మోహన్ నాయుడు ,పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** దేశసమగ్రత, పరిరక్షణ, అభివృద్ధి దృష్ట్యా తమిళనాడు ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు మద్దతుగా నిలవాలని ఏపీ నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.తమిళనాడు రాష్ట్రానికి ఎన్డీఏతోనే పూర్వ వైభవం వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అభివృద్ధి కావాలన్నా, ఉద్యోగాలు రావాలన్నా... సంక్షేమం అందాలన్నా అది ఎన్డీఏతోనే సాధ్యమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీకి, తమిళనాడుకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. తమిళనాడు పూర్వ వైభవాన్ని వివరించారు. తమిళనాడు నుంచి వచ్చిన ఎంతో మంది ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు దేశానికి ఎలాంటి సేవలు అందించారో వివరించారు. ఇదే సందర్భంలో రాజకీయ కారణాలతో తమిళనాడు రాష్ట్రానికి ఇప్పుడు జరుగుతున్న నష్టాన్ని ముఖ్యమంత్రి మీడియాకు వివరించారు. గతంలో మొత్తం దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉండే తమిళనాడు, చెన్నై ఇప్పుడు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలతో పోటీ పడగలుగుతున్నాయా అనే విషయాన్ని తమిళ ప్రజానీకం ఆలోచించాలన్నారు. తమిళ ప్రజలు ప్రోగ్రెసివ్ ఆలోచనలు చేస్తారని, ఇప్పుడు కూడా తమిళ ప్రజలు ఆ దిశగానే ఆలోచించి ఓట్లు వేయాలని ఏపీ సీఎం కోరారు. అర్థం పర్థం లేని వ్యతిరేకతతో మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసిన డీఎంకే, కాంగ్రెస్ వంటి పార్టీలను ఈ ఎన్నికల్లో దూరం పెట్టాలని ముఖ్యమంత్రి >>2

## సిఎం చంద్రబాబుకు తెలంగాణ మంత్రి పొన్నం లేఖ

### అనుచిత వ్యాఖ్యలు రాకుండా కట్టడి చేయాలని వినతి

**విజయవాడ,ఏప్రిల్21, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని, బీజేపీ, టీడీపీ నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవని పొన్నం ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు ద్వేషాలు రగిలించేలా ఉన్నాయని, అసందర్భ వ్యాఖ్యలు తెలుగువారి మధ్య వైషమ్యాలు రగిలించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. చంద్రబాబు చొరవ తీసుకుని బీజేపీ, జనసేన నేతలకు సర్దిచెప్పాలని, మరే ఇతర ఎంపీ రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా కట్టడి చేయాలని పొన్నం కోరారు. విభజనపై కర్నాటక ఎంపీ తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా స్పీకర్‌కు లేఖ రాయాలని, రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరమని అన్నారు.



## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా అనీల్‌చంద్ర పునేఠా బాధ్యతలు

**విజయవాడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా అనీల్‌చంద్ర పునేఠా బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఉద్యోగులు నూతన ఎస్ఈసీకి సాదర స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిపి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం అనీల్‌చంద్రపునేఠా రాష్ట్ర మూడో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనీల్‌చంద్ర పునేఠా గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 2024లో కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా నియమించింది.


సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి గన్ సియో హువాంగ్ తో భేటీ అయిన ఎపి మంత్రులు

## సింగపూర్‌లో మంత్రుల బృందం

### పాలనా విధానాలు, పట్టణాభివృద్ధి నమూనాల పరిశీలనకు వెళ్లిన మంత్రులు

### సింగపూర్ పరిశ్రమల మంత్రి గన్ సియో హువాంగ్‌తో భేటీ అయిన నారాయణ, అనిత, అచ్చెన్నాయుడు, జనార్దన్ రెడ్డి, సత్యకుమార్, సత్యప్రసాద్

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవారప్రతినిధి:** ఆధునిక పరిపాలనా విధానాలు, పట్టణ అభివృద్ధి నమూనాలు, సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ అందించడానికి సింగపూర్ ప్రభుత్వం అంగీకారంపై ఏపీ మంత్రులు ఆ దేశానికి వెళ్లారు. మంగళవారం నుంచి ఈ నెల 27 వరకు మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. పరిపాలన, లా అండ్ ఆర్డర్, రోడ్లు, పర్యాటక రంగాలను పరిశీలించనుంది. ఈ రోజు మొదటి రోజు అయినందున సింగపూర్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రుల బృందం ఆ దేశ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి గన్ సియో హువాంగ్ తో భేటీ అయ్యారు.ఈ సమావేశంలో రాష్ట్రమంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, అనిత, అచ్చెన్నా >>2

## పర్యాటకం పరుగులు

### నీతి ఆయోగ్ 'దివ్య భారత్' నివేదికలో రాష్ట్ర టూరిజానికి అగ్రతాంబూలం

### ప్రకృతి అందాలు చూడాలంటే ఎపికి వెళ్లాల్సిందేనని నీతిఆయోగ్ సిఫారసు: మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత దేశంలోని వివిధ రాష్ట్రాల వైవిధ్యభరితమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక , సహజ సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ నీతి ఆయోగ్ విడుదల చేసిన "దివ్య భారత్ ఏ విండో టు ది సోల్ ఆఫ్ ఇండియా" నివేదికలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి పెద్దపీట వేసింది. కూటమి ప్రభుత్వ కృషితో రాష్ట్ర పర్యాటక రంగం నేడు అద్భుత ప్రగతి ప్రయాణాన్ని సాగిస్తోందని ఈ నివేదిక చాటిచెప్పింది. ప్రపంచ పటంలో ఎపి పర్యాటక వైభవం: నీతి ఆయోగ్ విడుదల చేసిన 13 పేజీల సమగ్ర నివేదిక. 1.20నిమిషాల నిడివి గల ప్రత్యేక వీడియో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక గమ్యస్థానాలను ప్రపంచానికి పరిచయం చేశారు.భవిష్యత్ అంతా పర్యాటకానిదే అని ఆకాంక్షించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ల ఆశయాలకు ఈ నివేదిక మరింత బలాన్ని చేకూర్చింది. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించేందుకు అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు అత్యంత అనువైన సమయమని పేర్కొన్న నీతి ఆయోగ్, ఏయే నెలల్లో ఏ ప్రాంతాలను సందర్శించాలో విపులంగా వివరించింది. కూచిపూడి, విలాసిని నాట్యాల వంటి సంప్రదాయ కళలకు ఎపి కేంద్రమని, ఇక్కడి ఆత్మీయ ఆతిథ్యం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుందని అభివర్ణించింది. రాష్ట్రంలోని ప్రకృతి ప్రాంతాలు, ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, పురాతన కోటలు, సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహలు, విశాల సముద్రతీరం, అధ్యాత్మిక ప్రాంతాలు, ప్రఖ్యాతి గాంచిన స్థానిక వంటకాలు, సంప్రదాయ వస్త్రాలు,హస్త కళాకృతులు, బౌద్ధారామాలు, పర్యాటక ఉత్సవాలు, ఘనమైన వారసత్వం తదితర విశేషాలను నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొన్నది.

**నివేదికలో ప్రస్తావించిన ప్రధాన పర్యాటక ప్రాంతాలు:** ప్రకృతి ఒడిలో: అరకు వ్యాలీ, లంబసింగి, మారేడుమిల్లి, పాపికొండలు, కురుపాం అటవీ ప్రాంతాలు, దట్టమైన నల్లమల్ల అడవులు, హార్సిలీ హిల్స్, కొల్లేరు, పులికాట్ సరస్సు మరియు అందమైన కోనసీమ.

**జలపాతాలు - రిజర్వాయర్లు:** కొత్తపల్లి, రంపచోడవరం, తలకోన, ఎత్తిపోతల >>2



## ఇస్లామాబాద్ శాంతి చర్చల్లో ట్రంప్!

### వర్చువల్‌గానైనా పాల్గొంటారని రిపబ్లికన్ నేతల వెల్లడి

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 21:** అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే,దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని అమెరికా మీడియా కథనాలు వెలువడ్డాయి. ఇరు దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ గడువును పొడిగించే అవకాశం చాలా తక్కువని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే, ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే >>2

### తమిళనాడు, బెంగాల్‌లో తొలివిడత

## ప్రచారానికి తెర



### 234 తమిళ స్థానాలు, 152 బెంగాల్ సీట్లకు రేపే పోలింగ్

### అతిరథ,మహారథుల జాతకాలకు పరీక్ష

### మే 4న ఓట్ల లెక్కింపు

**చెన్నై, కోల్‌కత్తా, ఏప్రిల్ 21:** హోరాహోరీ ప్రచారం కొనసాగిన తమిళనాడు, బెంగాల్‌లో తొలి విడత ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. భారీ ర్యాలీలు, రోడ్ షోలతో మారుమోగిన మైకులు మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత మౌనం వహించాయి. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. తమిళనాడులో ఉన్న మొత్తం 234 శాసనసభ స్థానాలకు ఒకే విడతలో ఈనెల 23న పోలింగ్ జరగనుంది. మొత్తం 4 వేల 23 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సుమారు 5.73 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వయోవృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఇప్పటికే ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు, వేలాది పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసారు. మే 4న ఓట్లు లెక్కించి ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. రాష్ట్రంలో ప్రధానంగా రెండు బలమైన కూటముల మధ్య పోటీ నెలకొంది. ఈ ఎన్నికల బరిలో డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఎన్డీయే కూటమి అమీతుమీ తెల్చుకోనున్నాయి. వీటితో పాటు నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం కూడా తన >>2



వార్త

తక్షణ కర్తవ్యం నెరవేరిస్తే, తదుపరి కర్తవ్యం ఏమిటో సులువుగా తెలుస్తుంది.

- బైరన్

# సంశయాలకు సమాధానమిదేనా?

సహజ న్యాయ సూత్రాలనేవి అందరికీ వర్తిస్తాయి. కనుక వాటిని కాపాడాల్సింది న్యాయవ్యవస్థే. అదే న్యాయవ్యవస్థకు న్యాయప్రక్రియలో అభాసుపాలు కాకుండా తననుతాను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా కలిగి ఉంటుంది. న్యాయమూర్తి న్యాయపీఠమెక్కాక తన పర బేధాలుండవు. న్యాయవ్యవస్థ పుట్టినప్పటి నుంచి న్యాయపీఠంపై ఆసీనులైనవారికి ఎలాంటి కళంకం ఆపాదించకుండా తనను తాను కాపాడుకుంటోంది. ప్రజాస్వామ్యంలో ప్రధాన స్తంభంగా భావించే న్యాయవ్యవస్థపై అపనమ్మకం, అవిశ్వాసం లేకపోయినా సంశయంతో న్యాయమూర్తులను మార్చమని కోరుతుంటారు. న్యాయం కోసం న్యాయస్థానం మెట్లెక్కినట్లే తమకువెవరు న్యాయం చెప్పాలో కూడా వారే చెబుతున్నారు. సాధారణంగా న్యాయమూర్తులే తమ ముందు ఫలానా కేసు రాకూడదనో, రావద్దనో, తనకు ఆ కేసుతో పరిచయం ఉందన్న పేరుతో, 'నాట్ బిఫోర్‌మి'అని తప్పుకుంటుంటారు. అదీ న్యాయవ్యవస్థ నిజాయితీకి నిదర్శనం. కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన కొన్ని కేసులో న్యాయాధీశుల మీద సందేహాలు వ్యక్తపరుస్తూ బెంచిలు మార్పించుకున్న సందర్భాలు మనకు తారసపడుతున్నాయి. తాజాగా రెండు కేసులకు సంబంధించి న్యాయమూర్తుల కొనసాగింపు విషయంలో సోమవారం రెండు నిర్ణయాలు జరిగాయి. ఆ రెండు కేసులూ ప్రధాన రాజకీయ నేతలవే. మద్యం కుంభకోణం కేసు విచారణ నుంచి తనను తప్పుకోవాలని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ రిక్యూజల్ పిటిషన్‌లో కోరగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంతశర్మ 'నసే మిరా' అన్నారు. కేసుల్లో బలీయమైన సాక్ష్యాలను బట్టే తీర్పులుంటాయి తప్ప వ్యక్తులను బట్టి న్యాయమూర్తులు నిర్ణయించరన్న ఒకే ఒక న్యాయసిద్ధాంతాన్ని ఆధారంగా న్యాయవ్యవస్థ సామర్థ్యాలను ఒక రాజకీయవేత్త నిర్దేశింప జాలరని ఢిల్లీ హైకోర్టు తీర్పులో పేర్కొంది. ఈ కేసులో కేజ్రీవాల్ పిటిషన్లను జడ్జి తోసిపుచ్చారు. దాదాపు గంటసేపటికి పైగా తన తీర్పులోని ప్రధానాంశాలను ఆమె బహిరంగ కోర్టు హాల్లో వినిపించారు. ఎలాంటి ఆధారాలులేని ఆరోపణలతో కక్షిదారు న్యాయమూర్తి నిజాయితీని అంచనా వేయలేరని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలను తాను కొనసాగనివ్వలేనన్నారు. న్యాయమూర్తిపై వ్యక్తిగత దాడిని ఏకంగా న్యాయవ్యవస్థ మీద దాడిగా అభివర్ణించారు. తాను ఈవిచారణ నుంచి వైదొలగనని స్పష్టంగా చెప్పారు. గతంలో ఇదే కేసు సందర్భంగా జస్టిస్ స్వర్ణకాంతశర్మ పక్షపాత వైఖరితో వ్యవహరించారని అందుకే తన కేసులో ఆమెను తప్పుకోవాలంటూ కేజ్రీవాల్ కోరారు. పక్షపాతంగా వ్యవహరిస్తారనేది నిరాధార అనుమానాన్ని సంతృప్తిపరిచే దిశగా న్యాయమూర్తులు విచారణ నుంచి తప్పించుకోలేరన్నారు. కేవలం సందేహాలు, ఊహాగానాలతో ఓ రాజకీయ నేత న్యాయవ్యవస్థకు నష్టం కలిగించడం అనుమతించలేనన్నారు. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వ కేసు నుంచి అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచి న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ విద్యార్థి తనంతతానే తప్పుకున్నారు. ఒకబిజెపి కార్యకర్త చేసిన పోస్టులు తన కోర్టుపై నిందలు మోపినట్లు అనిపిస్తున్నందున తాను ఈ కేసు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటిస్తూనే మరో బెంచికి ఈ కేసు విచారణకు ఏర్పాటుచేయాలని ప్రధాన న్యాయమూర్తినికోరారు. కేజ్రీవాల్ పిటిషన్‌కు సంబంధించి న్యాయమూర్తి తన దృఢ వైఖరిని ప్రస్ఫుటింప చేశారు. కేసు నుండి వైదొలగడమంటే అదొక 'ప్రమాదకర ఆనవాయితీ'కి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు గది 'అభిప్రాయాల రంగస్థలం'గా మారకూడదని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్పు తనకువిరుద్ధంగానో, ఏకపక్షంగానో ఉందని తేల్చాల్సివస్తే అది ఉన్నత న్యాయస్థానానికే సాధ్యం అవుతుంది. ఈ కోర్టులో తగిన ఉపశమనం కల్పించకపోవచ్చనే కక్షిదారుడిలో అభద్రతా భావం మంచిది కాదన్నారు. తాను కక్షిదారుని డిమాండ్‌కు లొంగితేఎవరినైనా న్యాయవ్యవస్థను కదిలించగలం,మార్పు చేయవచ్చనే సంకేతాన్ని ఇచ్చినట్లు అవుతుంది. ఒక అబద్ధాన్ని కోర్టులో కానీ సోషల్ మీడియాలో కానీ వెయ్యిసార్లు చెప్పినా అదేమీ నిజం కాబోదంటూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా మరో భిన్నమైన కేసులో న్యాయమూర్తులపై చేసే నిర్లక్ష్యపు నిరాధార ఆరోపణలు న్యాయవ్యవస్థ పునాదులనే దెబ్బతీస్తాయని వాటిని అనుమతించబోమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఏదేని న్యాయమూర్తిపై వ్యక్తిగత ఆరోపణలు నిస్సందేహమైన ఆధారాలతో ఉండాలి. బాంబే హైకోర్టు న్యాయమూర్తి ఒక రాజకీయ పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు మంచివి కావని అటువంటి పిటిషన్లపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇలాంటి ఆరోపణలు విచారిస్తే ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉండే విశ్వాసాన్ని దెబ్బతీయడమేనని అభిప్రాయపడింది. న్యాయ నిర్ణయాలను హేతుబద్ధతతో విమర్శ చేయడంలో తప్పేమీ లేదని, కానీ తీర్పు చెప్పిన న్యాయమూర్తులపై వ్యక్తిగత వ్యవహారాలపై అబద్ధాల వ్యాప్తి అనుమతించబోమని వ్యాఖ్యానించింది. 'రిక్యూసల్' పిటిషన్‌ల విషయంలో తగు పరిమితులను అర్థం చేసుకోకుండా న్యాయవ్యవస్థ ప్రతిష్టను భంగపరిచే విషయంలో గతంలోనూ కొన్ని సందర్భాల్లో చర్చనీయాంశమయ్యాయి. న్యాయవ్యవస్థలో పారదర్శకత ఆవశ్యకత పెరిగింది. కేసు తీర్పు తమకు అనుకూలంగా ఉండకపోవచ్చునని సందేహాలు తలెత్తినప్పుడు కొంత మంది కక్షిదారులు 'రిక్యూసల్' పిటిషన్‌ను ఒక సాధనం గా ఉపయోగించుకుంటారు. ఇలాంటి వాటి విషయంలో న్యాయమూర్తులు వ్యక్తిగత నైతిక ప్రమాణాలు, సంస్థాగత నిబంధనలు పాటిస్తూ తీసుకునే నిర్ణయాలు స్వాగతించదగినవే.

మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహబలము వాటంతట అవే సమకూరుతాయి.



థామస్ ఫుల్లర్

అన్నీ మన మేలుకోసమే అని తలిస్తే, ఎలాంటి క్లిష్టపరిస్థితి కూడా మనసును కలతపెట్టలేదు.



జెఫర్సన్

# ప్రజావాక్కు

## కాంట్రాక్ట్ ఉద్యోగుల కష్టాలు?

రాష్ట్రంలో వివిధశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీసిబ్బంది, వర్క్‌చార్జ్డ్, దినసరి వేతన ఉద్యోగుల సమస్యలు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నడిచే పునాది వీరేనని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయినప్పటికీ, వీరి సేవలకు తగిన గుర్తింపు, భద్రత ఇంకా దక్కకపోవడం విచారకరం. 2014లోనే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనిమొట్ట మొదటి తెలంగాణ రాష్ట్రకేబినెట్ తీసుకున్న నిర్ణయం ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదు. ఇది ఒక్కరోజులో తీసుకున్న నిర్ణయం కాదు విస్తృతంగా అధ్యయనంచేసి, అన్నికోణాలు పరిశీలించిన తరువాత తీసుకున్న నిర్ణయం. అయినప్పటికీ, అమలు విషయంలో చోటుచేసుకుంటున్న ఆలస్యం అనేక సందేహాలకు తావిస్తోంది. కార్యాలయంలో శాశ్వత ఉద్యోగులతో సమానంగా పని చేస్తూ, తక్కువ వేతనంతో జీవించడం వారి దైనందిన వాస్తవం.

- సురేష్ కాలేరు, హైదరాబాద్

## దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

దివ్యాంగులు వివిధ దేవాలయాలలో దైవదర్శనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలి. ఉచిత బస్సురవాణా సౌకర్యం కల్పించాలి. దేవాలయాలలో వికలాంగుల దైవదర్శనం కోసం ప్రత్యేకమైన క్యూ ఏర్పాటు చేయాలి.సత్రాలలో ఉచిత సౌకర్యం కల్పించాలి. ఉచిత లడ్డు ఇవ్వాలి. దేవాలయాల వద్ద వికలాంగుల దైవదర్శనం వసతి కొరకు ప్రత్యేకమైన కౌంటర్‌ఏర్పాటు చేయాలి.స్వచ్ఛంద సంస్థలు,యువజన సంఘాలు,అధికారులు,ప్రజాప్రతినిధులు వికలాంగుల దైవదర్శనం కోసంఆర్థికసహాయం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## స్వీయ నియంత్రణ అవసరం

జ్ఞానం ఉన్నవాళ్లు కూడా తన భావోద్వేగాలను, కోపాన్ని, ఆలోచనలను నియంత్రించలేకపోతే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే జీవితంలో విజయం సాధించాలంటే స్వీయనియంత్రణ చాలాఅవసరం.స్వీయ నియంత్రణ కోల్పోయినప్పుడు మనిషి చేసే చర్యలు అనేక ప్రమాదాలకు దారితీస్తాయి.చిన్నవిషయాలకే కోపం రావడం, ఇతరులను దూషించడం, చేయి చేసుకోవడం వంటి చర్యలు సంబంధాలను దెబ్బతీస్తాయి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## ప్రభుత్వాలు సైన్స్‌ను ప్రమోట్ చేయాలి

ఈరోజు ప్రపంచం శాస్త్రీయంగా ఎంతో ముందుకుపోతుంది. ఇతర గ్రహాలలో కాపురం పెట్టేందుకు ఉరకలు వేస్తుంది. మనం మాత్రం ఆటవీకానికి వెళ్దాం అంటూ ఆధ్యాత్మికాన్ని ప్రమోట్ చేయటం విచారకరం.ఆధ్యాత్మికం పేరుతో గుళ్ల కట్టించాలి. ఒక్కోనియోజకవర్గంలో 20,30 గుళ్లు నిర్మించాలి అని రాష్ట్రముఖ్య మంత్రి చంద్రబాబు ప్రకటించటం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. హైటెక్ ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకున్న చంద్రబాబు ఈరోజుమోడీతో స్నేహం చేసినందువల్లనో ఏమో భక్తి ఉద్యమాన్ని భుజాన వేసుకున్నట్లుగా కనిపిస్తుంది. ప్రజలను గతంలో జరిగిన అరాచకం నుండి ఉద్ధరిస్తారని, చంద్రబాబును గెలిపించుకున్నారు.అంతేకానీ, గుళ్లను కట్టించేందుకు , మతాన్ని ప్రోత్సహించేందుకు ఎన్నుకోలేదు. ఆ విషయం గమనించాలి. మనది సెక్యులర్ దేశం. ప్రభుత్వపరంగా మతాన్ని ప్రమోట్ చేయకూడదు.

- నార్నే వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## జీతాల కోత విధించాలి

ఈ మధ్య కొన్ని ఐటీ దిగ్గజ సంస్థలు సైతం తమకు లాభాలు తగ్గిపోతున్నాయని వేల మంది ఐటీ వుద్యోగుల్ని ఆగమేఘాల మీద తొలగించి వేస్తున్నాయి. వారికి తగిన పరిహారం కూడా చెల్లిస్తున్నామని సంస్థలు ప్రకటిస్తున్నాయిగాని, సంవత్సరాల తరబడి ఆ కంపెనీ వృద్ధికి సేవచేసి జీవితంలో స్థిరపడుతున్న వేళ యుజ్ అండ్‌త్రో అన్నవిధంగా వున్న పళంగా వారి ఉద్యోగాలు తొలగించటం అన్యాయం. కనుక మనసుంటే మార్గం ఉంటుంది అన్న సామెత వలె గొప్పల కోసం పెద్ద వేతనాలు ఇస్తున్న ఈసంస్థలు తమనష్టాలను తొలగించుకోవాలని భావిస్తే వుద్యోగులను తొలగించే బదులు వారి వేతనాలపై కోత విధించవచ్చు. ఇష్టమైన వుద్యోగులు వుంటారు. ఇష్టం లేని వాళ్ళు మరో చోట ఉద్యోగం చూసుకుంటారు. ఈ నిర్ణయం వల్ల ఎవరికీ నష్టం ఉండదు, ఉభయ తారకంగా వుంటుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## నిరుపేదలకు పౌష్టికాహారం అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రులలో, హాస్టల్‌లో గ్యాస్ పేరుతో, నిధులు లేమి పేరుతో నిరుపేద బిడ్డలకు పౌష్టికాహారం అందించకుండా ఉండొద్దు. కచ్చితంగా పౌష్టికాహారం అందించాల్సిందే. ఎక్కడ నిర్లక్ష్యంవహించినా మనం ప్రశ్నించే అవకాశం ఉంది. అది మన హక్కు, మన వాటా. నిరుపేదలకు పౌష్టికాహారం అందించే బాధ్యత ప్రభుత్వాలది. అందరికి అందుబాటులో ఉండేవిధంగా పౌష్టికాహారాన్ని అందించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కాలుష్యమే మానవ మనుగడకు ముప్పు

**తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరిత హారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్స రాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలునాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఎదో చేయాలని మిన్నకుండిపోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.**

ఎస్.ఎమ్. కిష్టయ్య

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచ భూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింపబడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే ప్రపంచ ధరిత్రి దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపుకుంటున్నారు. 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతి రూపమే ఈ ధరిత్రీ దినోత్సవం.1969లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్సవం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయిఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచీ సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రిదినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 175 కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.అనాలోచిత మానవ చర్యలవల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయు కాలుష్యం పెచ్చుమీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి




వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పదిలంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించుకోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించగలగాలి. అడువుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో 'వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్స రంలో 'పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విష వాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి.ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్లు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది.మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరిత హారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్స రాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలునాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఎదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ●

# పాఠశాలల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాలి

ఎం. దామోదర్

ఆరోగ్యం అనేది మనిషి జీవితానికి మూలాధారం. ధనం, విద్య, అభివృద్ధి ఇవన్నీ ఆరోగ్యంతోనే అర్థవంతమవుతాయి. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బలంగా నిలుస్తుంది. కుటుంబం బలంగా ఉంటేనే సమాజం సుస్థిరంగా ఉంటుంది.సమాజం సుస్థిరంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దలు చెప్పిన మాట ఇప్పటికీ సత్యమే. నేటి వేగవంతమైన జీవనంలో మనం ఆరోగ్యాన్ని మరిచిపోయి, సౌకర్యాల వెనక పరుగులు తీస్తున్నాం.ముఖ్యంగా మహిళలు కుటుంబ బాధ్యతలు, ఉద్యోగం, పిల్లల సంరక్షణ ఇలా అనేక పాత్రలు పోషిస్తూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు.గర్భిణీలు, బాల్యం వంటి సున్నిత దశల్లో సరైన పోషణ లేకపోతే భవిష్యత్తు తరాల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. ఇప్పటి జీవన విధానం మన ఆహారపు అలవాట్లను, నిద్రపాట్లను,శారీరక చలనం (కదలికలను) తగ్గించడం ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో మన ఆరోగ్యంపై చైతన్యం పెంచుకోవడం అత్యవసరం. నేటి సమాజంలో ఆహారం జీవనాధారంగా కాకుండా వినోదంగా మారుతోంది. ఆకలి వేయకపోయినా తినడం, ఒత్తిడిని తగ్గించుకోవడానికి తినడం, అలవాటుగా తినడం వంటి పద్ధతులు పెరుగుతున్నాయి. టీవీ చూస్తూ, మొబైల్ వాడుతూ తినడంవల్ల మనం తినే ఆహారం మీద అవగాహన తగ్గిపోతోంది.ఈ విధమైన అలవాట్లు శరీరానికి కావాల్సిన పోషకాలు అందకుండా, అధిక కేలరీలు తీసుకునే పరిస్థితిని తీసుకొస్తాయి.ఈ సమస్యకు పరిష్కారం మైండ్‌ఫుల్ ఈటింగ్ అంటే తినే సమయంలో ఆహారంపై దృష్టి పెట్టడం, నెమ్మదిగా నమిలి తినడం, తృప్తి కలిగినప్పుడు ఆపడం. పళ్లెంలో ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ప్రోటీన్లు సమతులంగా ఉండాలి. కానీ నేటి యువత ఎక్కువగా రుచికరమైన, త్వరగా లభించే ఆహారాలవైపు మొగ్గుచూపుతోంది. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు చిప్స్, బిస్కెట్లు, ఫాస్ట్‌ఫుడ్స్,శీతలపానీయాలు వీటిలో అధికంగా చక్కెర, ఉప్పు,కొవ్వు, రిఫైన్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి.ఇవి తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి కానీ దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. వీటి వలన శరీరంలో డోపమైన్ ఉత్పత్తి పెరిగి, మరల మరల అదే రుచిని కోరే అలవాటు ఏర్పడుతుంది.ఇది ఒక రకంగా వ్యసనంగా మారుతుంది. ఇక ఫుడ్ డెలివరీ యాప్‌ల వల్ల




ఇంట్లోనే కూర్చొని ఎప్పుడైనా ఏ రుచినైనా పొందగలిగే పరిస్థితి ఏర్పడింది. ఇది సౌలభ్యం అయినప్పటికీ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు అడ్డంకిగా మారుతోంది.ఫుడ్ నాయిస్ అనే పరిస్థితి. ఎప్పుడూ తినాలని అనిపించడం మన జీవనశైలిలో భాగమవుతోంది. నేటి బాలలే రేపటి పౌరులు అనే మాటను మనం తరచూ వింటాం. కానీ ఆ బాలల ఆరోగ్యం గురించి మనం ఎంత శ్రద్ధ చూపుతున్నాం అనే ప్రశ్న ఆలోచనీయమే. నేటి పిల్లలు ఆటపాటలకు దూరమై, డిజిటల్ ప్రపంచంలో మునిగిపోతున్నారు. బయట ఆడుకోవడం తగ్గిపోవడం, శారీర కదలి(చలనం) తగ్గడం,జంక్ ఫుడ్ వినియోగం పెరగడం వల్ల చిన్న వయసులోనే ఊబకాయంసమస్యపెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో లక్షలాది పిల్లలు అధిక బరువుతో బాధపడుతున్నారు. భారతదేశంలో కూడా ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో గణనీయమైన శాతం ప్రాసెస్ చేసిన ఆహారం, చక్కెర పానీయాలు అధికంగా తీసుకుంటున్నారు. ఇది కేవలం బరువు సమస్య మాత్రమేకాదు మధుమేహం,రక్తపోటు,గుండె జబ్బులువంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. చిన్న వయసులోనే వచ్చిన ఊబకాయం పెద్దయ్యాక కూడా కొనసాగుతుంది.అంతేకాకుండా, ఇది పిల్లల మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. ఆత్మవిశ్వాసం తగ్గడం,ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు వస్తాయి. పరిశోధనలు చెబుతున్నట్టు, శారీరక చలనం లేకపోవడం, అసమతుల ఆహారం తీసుకోవడం పిల్లల మేధోసామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ అలవాట్లను మార్చుకోవాలి.పిల్లలకుఆరోగ్యకరమైన ఆహారం అందించడం, ఆటపాటలకు ప్రోత్సహించడం, స్క్రీన్ టైమ్‌ను నియంత్రించడం అవసరం. పాఠశాలలు కూడా ఆరోగ్య విద్యను బలోపేతం చేయాలి. ప్రభుత్వాలు జంక్ ఫుడ్ నియంత్రణకు, ఆరోగ్యకరమైన ఆహార ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యం అనేది ఒక్క రోజులో పొందేది కాదు.అది జీవితాంతం కొనసాగించే అలవాట్ల ఫలితం. సమతుల ఆహారం, క్రమబద్ధమైన జీవన శైలి, వ్యాయామం,మానసిక ప్రశాంతత ఇవి ఆరోగ్యానికి ప్రధాన స్తంభాలు. ముఖ్యంగా చిన్నారులలో మంచి అలవాట్లు పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ప్రతి కుటుంబం ఒక చిన్న ఆరోగ్య కేంద్రంగా మారాలి. తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలి. పాఠశాలలు ఆరోగ్యంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యాన్ని ప్రధాన విధానంగా తీసుకోవాలి. నిశ్చల జీవనశైలికి బదులు చలనం, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి. మన ఆరోగ్యాన్ని కాపాడుతూ, రేపటి తరానికి ఆరోగ్య భరోసా ఇవ్వాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన భారత దేశం నిర్మాణం సాధ్యం అవుతుంది. ●

# చట్టసభలలో మహిళల స్థానం ఎక్కడ?

మిద్దె సురేష్

దాదాపు మూడు దశాబ్దాల కల కలగానే మిగిలిపోనుందా అనే సందేహం మహిళలకే కాదు స్త్రీల ఉన్నతికి పాటు పడే వారందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. 131 రాజ్యాంగ సవరణ మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడంపై రకరకాల అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి. మహిళా బిల్లు వీగిపోవడం ఇప్పుడు కొత్తేం కాదు. సుమారు ఆరు ఏడుసార్లు అయింది. ఎన్డీయేకూటమి ఏమో మహిళా బిల్లుకు డీమేలిటేషన్ కలపడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని విపక్ష నేతలు వ్యతిరేకించి ఓటు వేశారని అర్థమైంది. పార్లమెంట్ ఈ బిల్లుకు అనుకూలంగా 298ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో ఆమోదానికి అవసరమైన మూడింట రెండు వంతు 352 మెజార్టీ దక్కలేదు. 2/3 మెజార్టీకి 54 ఓట్లు తక్కువ పడ్డాయి. మహిళా బిల్లు ఎన్డీయే కుట్రలో భాగమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎందుకంటే ఈ బిల్లు 2011 జనాభా లెక్కల ప్రకారం డీమిలీటేషన్‌తో ముడిపెట్టి ఓటింగ్ పెట్టడమే తప్పిదమని, కేంద్రం చాణక్యనీతికి మించి అత్యుత్సాహం చూపుతుందని బలంగా వాదిస్తున్నారు ఇండియా కూటమి నేతలు. ఓబీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్ పై కూడా స్పష్టత లేదు. కావునా విపక్షాలు మద్దతు తెలపలేదు. మహిళా బిల్లును వ్యతిరేకించిన వారిని దేశ ప్రజలు క్షమించరని, మహిళలను ఓటు అడిగే నైతిక హక్కు లేదంటుంది ఎన్డీయే కూటమి. మహిళా బిల్లుపై ఎవ్వరికీ ఎంత భాధ్యత ఉంది అనేది భవిష్యత్తులో తేలనుంది. ఎవరి వాదనలు ఎలా ఉన్న మహిళలు చట్టసభలలోకి వెళ్లడం వారి హక్కు. ఇకనైనా మహిళలపై గౌరవంతో వీలైనంత త్వరగా మహిళా బిల్లు ఆమోదానికై కలిసి కట్టుగా పని చేయాలి. మహిళా బిల్లుకు చట్టబద్ధతకు ఎన్డీయే కూటమి ఆమోదించేలా ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత విపక్షాలపై ఉంది. ఎవ్వరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహించి చిత్తశుద్ధి కాపాడు కుంటారో ఆ పార్టీలను మహిళాలోకం గుర్తిస్తుందని మారువ రాదు. దేశంలో కొన్ని రాష్ట్రాలు స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చిన వారి అధికారులను కూడా తమ ఇంట్లో వారు అధికార దర్పం చాటుకుంటున్నారు. మహిళ ప్రజా ప్రతినిధులకు పూర్తి స్వేచ్ఛలేదనే చెప్పవచ్చు. సమాన హక్కులతో పాటు చట్టసభల రిజర్వేషన్ కల్పించినప్పుడే మహిళలకు న్యాయం సంపూర్ణ జరుగుతుంది. కేంద్రప్రభుత్వం కూడా నిస్వార్థంగా మహిళా బిల్లును ఆమోదం తెలిపేలా చేసి ఉంటేమహిళల దృష్టిలో కేంద్రంపై ప్రత్యేకమైన ఆదరణ ఉండేదేమో. రాజకీయ దూరదృష్టితో మహిళా బిల్లుకు కావాలనే సంపూర్ణ మద్దతు తెలుపడం లేదా అనే ఆలోచన మేధావులు, రాజకీయ విశ్లేషకులు, విద్యావంతులలో వస్తుంది. ఎందుకంటే జనాభా,కులాల ప్రాతిపదికన రిజర్వేషన్‌అమలు చేయాలి అంటున్నాము.



చట్టసభలలో కూడా యాభైశాతం జనాభా ఉన్న మహిళలకు రిజర్వేషన్ ఎక్కడ ఉంది. వారికి రావాల్సిన వాటా హక్కు ఇవ్వాలి కదా. ఎందుకు జాప్యం చేస్తున్నారో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఏదిఏమై నప్పటికీ మహిళా బిల్లు రావాలి. ఎందుకంటే శాసనాల నిర్మాణాల, అభివృద్ధిలో మాహిళల పాత్ర ఉండాలి. ఈ సృష్టిలో నింగి నుండి నేల వరకు మహిళా మణులు సేవలు అందిస్తున్నారు. రాజకీయాలలో మాత్రం మహిళలకు రావాల్సిన ముప్పైమూడు శాతం పార్లమెంట్,రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 1/3 వంతు సీట్లు రిజర్వేషన్ అమలు చేయాలి కానీ మహిళా బిల్లు సుదీర్ఘ కాలంగా ఆమోదం పొందలేక పోయింది. చివరగా మహిళలు చైతన్యం అవుతే తప్ప బిల్లు ముందుకు సాగదు. మహిళలు ఉద్యోగ విధులు నిర్వహించడమే కాకుండాఇంట్లో వారికి సేవలు అందిస్తూ సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నారు అందుకే స్త్రీ అంటే అబల కాదు సబల కావాలంటూ వీర వనితలను ఆదర్శంగా చూపెడు తాం. అలాంటిది దేశ రాజకీయాల్లో ఆశించిన ప్రాధాన్యత లేకపోవడం గమనార్హం. ఎందుకంటే స్వాతంత్ర్య పోరాటం మొదలుకుని సామాజిక ఉద్యమాల వరకు శంఖారావం పూరించిన ఘనత స్త్రీలదే అని చరిత్ర తెలుపుతుంది. స్త్రీలు ఏకమై కదం తొక్కుతూ ఉప్పెనలా కదులుతేనే మహిళ బిల్లు ఆమోదానికి అడుగులు పడతాయి. మహిళలను గౌరవించుకుంటూ ప్రతి ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ఘనంగా నిర్వహిచుకుం టూ మహిళలో చైతన్యం రావాలని నినదిస్తూ మహిళ బిల్లుపై అధికార, ప్రతిపక్షాలు మాటలు కోటలు దాటుతాయి. ఆచరణలోకి వచ్చే సరికి శూన్యం. రాజకీయ పార్టీలు రాజకీ యాలకు అతీతంగా మహిళల అభ్యున్నతి ముఖ్యమని భావించినప్పుడే మహిళా బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉంది. ప్రపంచ ఉద్యమాలలో మహిళ పాత్రనే కూడాకీలకమైంది, మహిళలు వారి హక్కుల కోసం ప్రశ్నించే గళంతో నినదించి పోరాడిన సందర్భాలు చూశాం. అదేఒరవడితో మహిళా బిల్లుకై ఒక్కటై పోరాడాలి. 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగాప్రకటించి వారిహక్కుల కోసం పని చేస్తుంది, ప్రతి ఏటా మహిళల సాధికారతకై ఒక థీమ్ తీసుకువస్తూ వారి అభివృద్ధిని ప్రోత్సాహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురుషులకు దీటుగా పోటీపడి అవార్డులు, రివార్డులు సాధిస్తున్నా వారి హక్కులను కాలరాస్తున్నాం. పూర్వంనుండి గత దశాబ్దం క్రితం వరకు మాహిళలను ప్రధానంగా పట్టి పీడించిన కొన్ని రుగ్మతలు బాల్య వివాహాలు, దేవదాసి, సతీ సహగమనం, నిరక్షరాస్యత వంటివి వారివెనుకబాటుకు కారణమైనవని గతం తెలుపుతుంది.దశాబ్దాల కాలంతర్వాత మహిళలు చైతన్యం అవుతూ సమాజంలో ముందుకువెళ్తున్న తరుణంలో మహిళా రిజర్వేషన్ వారికి తోడ్పాటు అందిస్తే రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రగతి సాధిస్తారు. ఒక్కప్పుడు మహిళ అంటే వంట గదికే పరిమితం అనే ఆంక్షలను తెంచుకుని నేడు దేశ అభివృద్ధిలో మహిళలదే పై చెయ్యి ఉంది. మహిళ అంటే ఒక శక్తిగా భావిస్తూ మహిళా బిల్లుకు జనమంతా జాగృతమై మద్దతు తెలుపుదాం. మహిళల పురోగతికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ మహిళ సంక్షేమం,అభివృద్ధి చైతన్యాన్ని కాంక్షిస్తూ మహిళా బిల్లుకై ఏకమై ఉద్యమిద్దాం. ●

# గుంటూరు వార్త

### తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో
## కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**తెనాలి, ఏప్రిల్21,(ప్రభాతవార్త):** తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలను,గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని పలు విభాగాలను సందర్శించిన ఆయన,అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అదేవిధంగా ఆసుపత్రి ప్రాంగణంలోని సౌకర్యాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయా లేదా అనే దానిపై పలువురు రోగులను వారి సహాయకులను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ వైద్యశాలలను వినియోగించుకునేది, సామాన్యులు మధ్యతరగతి వారే అధికంగా ఉంటారని, వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన వైద్య సేవల్లో, ఎటువంటి లోపం లేకుండా, రోగి పూర్తిగా కోలుకునే వరకు వారికి కావలసిన ఆహారం మందులు అందిస్తూ, పూర్తిస్థాయి చికిత్సను అందించడంలో హాస్పటల్ వైద్యులు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. అనంతరం హాస్పిటల్ కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు, ప్రతిరోజు ఎంతమంది రోగులు సందర్శిస్తున్నారు,వారిలో ఎంతమందికి పూర్తిస్థాయి చికిత్స అందుతుంది మందులు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు.అంతే కాకుండా రోగులకు వివిధ రకాలైన పరీక్షలు అందుబాటులో ఉన్నాయా అని హాస్పటల్ సూపరెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ని అడిగి తెలుసుకున్నారు.



### తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన
## జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

**తెనాలి మున్సిపాలిటీ,ఏప్రిల్21,(ప్రభాతవార్త):** గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ సీఎం. సాయికాంత్ వర్మ మంగళవారం,తెనాలి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో అందిస్తున్న ప్రజాసేవలు, రికార్డుల నిర్వహణ మరియు కార్యాలయ నిర్వహణ పద్ధతులను ప్రశంసిస్తూ తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ కృషిని అభినందించారు. పాత భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినందుకు ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. అలాగే దాతల సేవాభావాన్ని కొనియాడుతూ వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



### పిర్యాదులను సంబంధిత అధికారులు
## నిర్దేశిత గడవులోగా పరిష్కరించాలి

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** ప్రజల నుండి అందిన పిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి వాటిని నిర్దేశిత సమయంలోపు పరిష్కారం అయ్యేలా చూడాల్సిన బాధ్యత పి.యం.యు (ప్రాజెక్ట్ మోనిటరింగ్ యూనిట్) సిబ్బంది పై ఉందని కమిషనర్ కె. మయూర్ అశోక్ అన్నారు. మంగళవారం నగర పాలకనగర సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పి.యం.యు సిబ్బంది తో ప్రజల నుండి అందుచున్న పిర్యాదుల సత్వర పరిష్కారం పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నాయని, ప్రజల వద్ద నుండి వచ్చే పిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి, అవి నిర్దేశిత గడువులోపు పరిష్కారం అయ్యేలా సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సాంబశివరావు, డి.ఈ.ఈ కళ్యాణ్ రావు, పి.యం.యు సిబ్బంది పాల్గొన్నారు.



### స్వీయ జన గణనకు విద్యావంతులు ముందుకు రావాలి

**కమిషనర్ కె.మయూర్ అశోక్**



గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21( ప్రభాత వార్త ) : స్వీయ జన గణనకు విద్యావంతులు ముందుకు రావాలని కోరిన కమిషనర్ కె.మయూర్ అశోక్ పిలుపు నిచ్చరు.జనగణన అనేది దేశాభివృద్ధికి ఎంతో కీలకమైన ప్రక్రియ అన్నారు.గుంటూరు నగరంలో స్వీయ జనగణనకు విద్యా వంతులు ముందుకు రావాలని, కేవలం తమ వివరాలు మాత్రమే కాకుండా, తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు, సాంకేతిక పరిజ్ఞానం లేని తోటి వారికి కూడా వారి వివరాలను నమోదు చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.స్వచ్ఛంద స్వీయ గణన ఈనెల 30వ తేదీ వరకు ప్రజలకు **se.census.gov.in** వెబ్ సైట్ ద్వారా అందుబాటులో ఉంటుందన్నారు.

# రైతు ఆదాయం పెరిగేలా కృషి చేయాలి

### గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

**గుంటూరు ఏప్రిల్ 21, ప్రభాతవార్త ప్రతినిధి :** రైతు ఆదాయం పెంచే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ అన్నారు. ప్రాథమిక రంగాల శాఖలతో జిల్లా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవసరం మేరకు పంటల విధానాన్ని మార్పు చేసి అధిక ఆదాయం వచ్చే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పంటల వారీగా వస్తున్న ఆదాయాన్ని పరిశీలించాలని, ఉత్తమ మార్కెటింగ్ విధానాలను అనుసరించాలని ఆదేశించారు. రైతుల పెట్టుబడులు తక్కువ కావాలని అందుకు అవసరమైన యాంత్రికరణ పెంచాలని సూచించారు. పొలంబడి కార్యక్రమాలను నిర్వహించాలని అందులో అందుబాటులో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం సేవలు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు ఈ కేవైసీ, ఇ పంట చేయాలని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం సాంకేతిక పరిజ్ఞానంగా కాకుండా రైతులకు అత్యంత ఉపయోగకరమైన పరికరంగా ఉపయోగించాలని అన్నారు. రైతుకు మంచి ధరలు రావాలని, ఎగుమతి రకం ఉత్పాదకాలు పొందాలని అన్నారు. ఉద్యానవన ఉత్పాదకాలకు పశ్చిమ ఆసియాలో మంచి గిరాకీ ఉందని అన్నారు. మండలాల వారీగా పంటల వివరాలు ఆదాయ మార్గాలు మార్కెటింగ్ తదితర వివరాలతో నివేదిక అందించాలని అన్నారు. ఖరీఫ్ పంటను ముందుకు తీసుకువచ్చే విధంగా ఆలోచన చేయాలని తద్వారా తుఫాన్ల తాకిడి నుండి బయటపడే అవకాశాలు ఉంటాయని అన్నారు.



**ఎన్.పీ.ఓ.పి, ఎన్.పి.ఓ.ఎస్ సర్టిఫికెట్లు పొందాలి**

ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఎన్.పీ.ఓ.పి, ఎన్.పి.ఓ.ఎస్ సర్టిఫికెట్లు పొందే దిశగా కృషి చేయాలని తద్వారా ప్రపంచ వ్యాప్తంగా సంబంధిత సేంద్రీయ ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంటుందని అన్నారు. ఉత్పాద అధికంగా ఉంటే ఫుడ్ పార్క్ ఏర్పాటుకు కూడా చర్యలు చేపట్టవచ్చని అన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు దృష్ట్యా దాని ప్రభావాన్ని జిల్లాలో అంచనా వేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ముందుగా తగు సూచనలు జారీ చేసి తదనగుణంగా పంటలు వేసేందుకు సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వలన జిల్లాలో నీటి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, ఏపి.ఎం.ఐ.పి ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ జిల్లాలో చేపడుతున్న వివరాలను తెలిపారు.

## బాపట్లలో మత్తు ముఠా ఆటకట్టించిన పోలీసులు

**-29 మంది అరెస్టు**
**-2.75 కేజీల గంజాయి,**
**23 మొబైల్ ఫోన్లు,నగదు స్వాధీనం**

**బాపట్ల, ఏప్రిల్ 21. ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల జిల్లాలో గంజాయి మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఇచ్చిన పిలుపుతో రంగంలోకి దిగిన ఖాకీలు.. మెరుపు దాడులు నిర్వహించి భారీ గంజాయి ముఠాను పట్టుకున్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.



**శ్మశానాలే స్థావరాలుగా..** జన సంచారం తక్కువగా ఉండే శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలుగా విడిపోయారు. బాపట్ల పట్టణంలోని అరవపాలెం, బాలకృష్ణాపురం, ఉప్పరపాలెం శ్మశాన వాటికలు మరియు జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డుపై ఏకకాలంలో దాడులు నిర్వహించి మొత్తం 29 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఒరిస్సా నుంచి బాపట్లకు సరఫరాప్రధాన నిందితుడు (ఎ 1) అత్తుమురి ప్రేమ్ కుమార్ గతంలోనూ పలు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇతను ఒరిస్సా సరిహద్దుల్లోని సరోజ్ ఖరా అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, రైలు మార్గంలో బాపట్లకు తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడ స్థానిక రౌడీ షీటర్లు, యువకులకు ఫోన్ పే మరియు నగదు రూపంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

గంజాయి:2.75 కేజీలు (విలువ సుమారు రూ. 1.50 లక్షలు),మొబైల్ ఫోన్లు 23, నగదు రూ. 15,500/స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయిని నిర్మూలించేందుకు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.ఎవరైనా గంజాయి రవాణా చేసినా, వాడినా పీడీ యాక్ట్ నమోదు చేయడమే కాకుండా జిల్లా బహిష్కరణ విధించడం జరుగుతుందని హెచ్చరించారు.



పోలీసులకు రివార్డుల పంఅత్యంత చాకచక్యంగా ఈ ముఠాను పట్టుకున్న బాపట్ల డీఎస్పీ సిహెచ్. చంద్రమౌళి, సీఐ రాంబాబు, ఎస్ఐలు విజయ్ కుమార్, నస్రీన్ మరియు ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డులను అందజేశారు.

## స్వీయ గణనకు గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీకారం

**గుంటూరు ఏప్రిల్ 21, ప్రభాతవార్త ప్రతినిధి :** గుంటూరు జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి, జిల్లా కలెక్టర్ ససాయి కాంత్ వర్మ స్వయంగా స్వీయ గణన చేసుకుని స్ఫూర్తిగా నిలిచారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదుకు ఏప్రిల్ 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న తొలి జనాభా గణనగా ప్రత్యేకత సంతరించుకుందని అన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2027 జనాభా గణన రెండు దశల్లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మొదటి దశగా ఇళ్ల జాబితా, గృహ గణన నిర్వహిస్తారని చెప్పారు. ఇందులో ప్రతి ఇంటి వివరాలు, గృహ పరిస్థితులపై సమాచారం సేకరించడం జరుగుతుందని అన్నారు. రెండవ దశలో జనాభా గణన చేపట్టడం జరుగుతుందని అన్నారు. దేశాభివృద్ధిలో కీలకమైన ఈ జాతీయ కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, డిజిటల్ పద్ధతిలో తమ వివరాలను నమోదు చేసుకుని జనగణనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి విజ్ఞప్తి చేశారు.



### సచివాలయాలను ఆకస్మికంగా
## తనిఖీ చేసిన చీఫ్‌విప్ జీ.వీ

**వినుకొండ,ఏప్రిల్21,ప్రభాతవార్త:** పట్టణంలోని కట్టకింద బజార్‌లో ఉన్న 10వ సచివాలయాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించడంలో ఎటువంటి జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించారు. సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా చూడటమే ధ్యేయంగా పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పౌరులకు మెరుగైన సేవలందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు,ఫిర్యాదులు నిర్దిష్ట గడువులోనే పరిష్కారం చేయాలన్నారు. సేవలందింపులో ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా ఉపయోగించడంతో పాటు,ప్రతి సచివాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిజిస్టర్ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం సిబ్బంది బాధ్యతగా పేర్కొన్నారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాగా పనిచేసిన ప్రభుత్వ సిబ్బందికి అవార్డులు ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# దోమల నిర్మూలనకు మిషన్ మస్కిటో

**- డ్రోన్లతో చల్లుతున్న మందు**
**- 26 చెరువుల్లో 174 ఎకరాల విస్తీర్ణంలో ప్రయోగం**

### నగర కమిషనర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలో దోమల నుండి నగర ప్రజలకు రక్షణ కల్పించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏఐ బేస్డ్ డ్రోన్ల ద్వారా దోమల లార్వాను అంతం చేసేందుకు శ్రీకారం చుట్టామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. నగరంలోని ప్రధాన జలాశయాల్లో డ్రోన్ల ద్వారా దోమల నివారణ మందుల పిచికారీ ప్రక్రియను చేపట్టినట్టు తెలిపారు. నగరవ్యాప్తంగా గుర్తించిన సుమారు 26 ప్రధాన చెరువులు, మురుగునీరు నిల్వ ఉండే లోతట్టు ప్రాంతాలను లక్ష్యంగా మొత్తం 174 ఎకరాల విస్తీర్ణంలో ఈ డ్రోన్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. సమస్యను అధిగమించేందుకు ఆధునిక ఏఐ ఆధారిత డ్రోన్లను రంగంలోకి దించామని, ఈ డ్రోన్లు నీటి ఉపరితలంపై అతి తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ, దోమల లార్వా అభివృద్ధి చెందే కేంద్రాలపై ఖచ్చితత్వంతో టెమిఫస్ లార్వాసైడ్ మందును పిచికారీ చేస్తున్నాయన్నారు. కేవలం చెరువుల్లోనే కాకుండా, నగరంలోని ప్రతి వార్డులో యాంటీలార్వా ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు..జీఎంసి నుండి ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ ప్రజల భాగస్వామ్యం లేనిదే పూర్తిస్థాయిలో దోమల నిర్మూలన సాధ్యం కాదన తెలిపారు.



### కాలుష్య నియంత్రణ అనుమతులు సరళీకృతం

**గుంటూరు ఏప్రిల్ 21,ప్రభాతవార్త ప్రతినిధి :** కాలుష్య నియంత్రణ అనుమతుల సరళీకరణ ద్వారా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చర్యలు చేపట్టిందని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించేందుకు, పరిశ్రమల నియంత్రణను సరళీకరించేందుకు అనేక చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. డిజిటలైజేషన్ ద్వారా పరిశ్రమల స్థాపన అనుమతులు, నిర్వహణ అనుమతులు మంజూరు చేయడానికి పట్టే సమయాన్ని గణనీయంగా తగ్గిందన్నారు. ఆన్‌లైన్ సింగిల్ విండో వ్యవస్థ ద్వారా పరిశ్రమలు దరఖాస్తులు సమర్పించడం, పారదర్శకంగా అనుమతులు పొందడం సులభమైందని చెప్పారు. నిర్ణయించిన గడువులో అనుమతులు జారీ చేయడం జరుగుతోందన్నారు. పూర్తిగా డిజిటల్ విధానం ద్వారా పారదర్శకత పెరిగిందని, పేపర్‌వర్క్ తగ్గిందన్నారు. తక్కువ ప్రమాదం గల పరిశ్రమలకు సరళమైన విధానాలు అమలులో ఉన్నాయన్నారు. హెల్ప్‌డెస్క్‌లు, ఆన్‌లైన్ ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు అందుబాటులోకి తేవడం జరిగిందని వివరించారు. పరిశ్రమల ఫీజులను సమయానికి చెల్లించడం, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని గుంటూరు ప్రాంతీయ కార్యాలయం విజ్ఞప్తి చేస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక అభివృద్ధి మధ్య సమతుల్యతను కొనసాగిస్తూ, పారదర్శక, సాంకేతిక ఆధారిత పరిపాలనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.



### కలెక్టర్ కార్యాలయంలో క్యారం బోర్డు ఆడటం అనేది అవాస్తవం

**బాపట్ల, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** సోషల్ మీడియా,ఛానళ్లలో కలెక్టర్ కార్యాలయంలో క్యారం బోర్డు ఆడుతున్నట్లు ప్రచారంలో ఉన్న వార్తల్లో వాస్తవం లేదని డీఆర్వో గంగాధర్ గౌడ్ స్పష్టం చేశారు. వీడియోలో కనిపిస్తున్న ప్రదేశం జిల్లా కలెక్టర్ కార్యాలయం కాదని, అది ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయమని తెలిపారు.ఈ ఘటనపై ఐదుగురు ఉద్యోగస్తులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్లు తెలిపారు. సంబంధిత ఉద్యోగస్తుల వివరణ అందిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డీఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు.

### ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ఏపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం గుంటూరు జిల్లా నాయకత్వం కలెక్టరేట్ ఎదుట శాంతియుత ధర్నా నిర్వహించి గుంటూరు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు . రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎజెండాగా చేసుకొని జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలి. నూతన పి ఆర్ సి కమిటీ వేసి 30 ఇంటీరియర్ రిలీఫ్ మంజూరు చేయాలి. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి. మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి ఓ పి ఎస్ వర్తింపజేయాలి. పెండింగ్ డి ఎ లు, జిపిఎఫ్ ఏపీ జి ఎల్ ఐ ఏన్క్యాష్మెంట్ చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రిటైర్ అయిన రోజే ఇవ్వాలి. విశ్రాంత ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలి.302 జీవో పునరుద్ధరించి జే యల్ పదోన్నతులు కల్పించాలి. ఎస్ ఏ తెలుగు/హిందీ ప్రమోషన్లలో ఎస్ జి టి లకు 70 , డైరెక్ట్ రిక్రూట్మెంట్ వారికి 30 అమలు చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయులకు జిపిఎఫ్ ఖాతాలు ఏర్పాటు చేయాలి. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లను గ్రేడ్1 లుగా మార్చాలి. ఉర్దూ, ఒరియా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఆ బడులను బలోపేతం చేయాలి. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను నియమించాలి. ప్రతి ఉన్నత పాఠశాల/మోడల్ ప్రైమరీకి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలి. ఉపాధ్యాయ రేషనలైజేషన్ 5 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే చేపట్టాలి. ఎస్ ఎస్ ఏ లోని ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్, పిఈటిలను ఫుల్ టైం చేయాలి. ఎస్ఎస్ఏ, సిఆర్‌టి, సీఎంఆర్‌టి సిబ్బందికి 60 వేతనం పెంచి ఎం టి ఎస్ పరిధిలోకి తేవాలి అనే వివిధ డిమాండ్లను వినతి పత్రం ద్వారా తెలియపరుస్తూ జిల్లా కలెక్టర్కు అందజేశారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఏపీ జెఏసి గుంటూరు జిల్లా చైర్మన్‌జి . శ్రీనివాస రావు విచ్చేశారు. పి ఆర్ టి యు గుంటూరు జిల్లా అధ్యక్షులు జి వి ఎస్ రామకృష్ణప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసరెడ్డి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో .రాంబాబు,బాపట్ల జిల్లా అధ్యక్షులు , శ్యామ్ మోజెస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ఎం వెంకటేశ్వరరావు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి,ఎం చంద్రకిషోర్ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు, వై నాగమణి రాష్ట్ర కార్యదర్శి ,షేక్ అబ్దుల్ రజాక్ గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.



## ఇరువురు నిందితులు అరెస్టు

**గుంటూరు,ఏప్రిల్21,ప్రభాతవార్త:** మద్యం దుకాణంలో మద్యం సేవిస్తూ అకారణంగా ఇరువురు వ్యక్తులపై దాడి చేసి ఓ వ్యక్తి ని హతమార్చేందుకు ప్రయత్నించిన ఇరువురుని నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుంగ బాలక్రిష్ణ,మారుతి పూర్ణచంద్రరావు అనే ఇరువురు వ్యక్తులు ఈ నెల 19వ తేదీన రాత్రి నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని కంకర గుంట గేటు వద్ద ఉన్న నిర్మల్ వైన్స్ పై అంతస్తు లోని ఓ రూములో మద్యం సేవిస్తున్నారు.వారి ప్రక్క ఉన్న మరో రూములో దేవరకొండ స్వరూప్ సాగర్,దేవరకొండ శశికుమార్ బాలక్రిష్ణ, పూర్ణచంద్రరావు తో అకారణంగా గొడవ పెట్టుకుని బీరు సీసా పగలగొట్టి దాడి చేశారు.భయబ్రాంతులతో బాలక్రిష్ణ, పూర్ణచంద్రరావు ఇరువురు పారిపోతుండగా బాలక్రిష్ణ ను పట్టుకుని డాబా పైనుంచి తలక్రిందులుగా వేలాడదీసి క్రిందకు పడేసేందుకు ప్రయత్నిచారు.అంతలో వైన్స్ సిబ్బంది గమనించి అక్కడకు వెళ్లి నిండుతుల నుండి బాధితుడిని విడిపించారు.తరువాత నిండుతుడు మరో వ్యక్తి పూర్ణచంద్రరావుని పిడిగుద్దులు గుద్ది ఇబ్బందులకు గురిచేశారు.బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నగరంపాలెం పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీ బెల్లం శ్రీనివాసరావు పరియవేక్షణలో సీఐ సత్యనారాయణ తమ సిబ్బందితో వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

# జేఈఈ మెయిన్ 2026 పరీక్ష ఫలితాలలో జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచిన గుంటూరు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

**ఫస్ట్ బ్యాచ్ లోనే అల్ ఇండియా 44వ ,297వ 334 ర్యాంక్ లతో పాటు 402 నుంచి మూడు వేల లోపు వరుసగా ర్యాంకులతో విద్యార్థులు విజయకేతనం**

**గుంటూరు జిల్లాలోనే అగ్రస్థానంలో కళాశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు.**

**గుంటూరు, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త) :** ప్రతిష్టాత్మకమైన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకై సోమవారం ప్రకటించిన జేఈఈ మెయిన్ 2026 ఫలితాలలో " గుంటూరు ఆక్స్ ఫర్డ్ విద్యార్థులు అన్ని క్యాటగిరిలలో జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచి ర్యాంకులు సాధించడం అభినందనీయమని విద్యాసంస్థల చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్లు ఎస్ విజయభాస్కర్ రెడ్డి,జోసెఫ్ రెడ్డిలు తెలిపారు. శ్యామల నగర్ లోని ఆక్సిర్ఫ్ బ్రాంచ్ లో విలేకర్ల సమావేశం లో మాట్లాడుతున్న ఆక్సిర్ఫ్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఎస్ విజయభాస్కర్ రెడ్డి,జోసెఫ్ రెడ్డిలు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జేఈఈ మెయిన్ 2026లో తమ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో సాధించిన ర్యాంకుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయభాస్కర్






రెడ్డి, జోసెఫ్ రెడ్డి లు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఇంజనీరిగ్ ప్రవేశ పరీక్ష అయినా జేఈఈ మెయిన్ 2026 పరీక్ష ఫలితాలలో అన్ని కేటగిరీలలో ఇప్పటివరకు అందిన ఫలితాల ప్రకారం 100 లోపు, 500 లోపు ర్యాంకులు సాధించి, ర్యాంకుల వరద సృష్టించారని తెలిపారు. ఆల్ ఇండియా 44 ర్యాంకులు ఏ. లాజర్ అనే విద్యార్థి, 297 ర్యాంకు వి.మహిత అనే విద్యార్థిని, పి. ధనుంజయ రెడ్డి 334 ర్యాంకు, పి ఎన్ ఎస్ పి సునయాన 402వ ర్యాంకు సాధించారన్నారు. అలానే 100లోపు, అదేవిధంగా 500 లోపు ర్యాంకులు సాధించి విద్యార్థులు సునామి సృష్టించారని అందుకు కష్టపడిన విద్యార్థులకు, అధ్యాపకులకు, పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మారుతున్న విధానాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలను తయారుచేసి అందుకు తగిన విధంగా అత్యుత్తమ స్థాయి బోధన అందించడం జరిగిందన్నారు. దీని పర్యవస్థానమే జాతీయస్థాయి పోటీ పరీక్షలలో సునాయాసంగా ఆల్ ఇండియా అత్యుత్తమ ర్యాంకులను సాధించడం అభినందనీయమన్నారు. ఈ ఫలితాలలో ఒక్క గుంటూరు ఆక్సిర్ఫ్ నుండే సుమారు 21 మంది ఎన్ఐటి, ట్రిబుల్ ఐటీలలో సీట్లు సాధించబోవడం, ప్రతి ముగ్గురు విద్యార్థులలో ఒకరు ఐఐటి, జేఈఈ అడ్వాన్స్ ఎగ్జామ్ కి క్వాలిఫై అవటం జిల్లాకే గర్వకారణం అని తెలిపారు. చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి తమ విద్యాసంస్థలలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి రాష్ట్రంలోనే బెస్ట్ అనే అధ్యాపకులతో సులభతరంగా విద్యను అందించి అత్యుత్తమ ప్రతిభతో ర్యాంకులు సాధించడం గర్వకారణం అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీఈఓ సన్నీ హెన్డ్రిక్స్, డీన్ మురళీకృష్ణారెడ్డి, డీజీఎం శేషగిరిరావు, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 23 నుంచి ఎస్ఆర్ఎంలో జాతీయస్థాయి క్రీడోత్సవాలు

## ముఖ్య అతిథిగా రియో ఒలింపిక్స్ పతక విజేత సాక్షి మాలిక్

**మంగళగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల 23 నుంచి ఉద్గమ్ 2026 పేరిట జాతీయ స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడాపోటీలకు



రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లోని పలు యూనివర్సిటీల నుంచి సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు హాజరవుతున్నారు. గురువారం ఉదయం యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగే ప్రారంభ వేడుకలకు రియో ఒలింపిక్స్ లో భారత్ కు కాంస్య పతకాన్ని అందజేసిన అంతర్జాతీయ రెజ్లర్ సాక్షిమాలిక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు.ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏడాదికోసారి జాతీయ స్థాయిలో ఉద్గమ్ పేరిట క్రీడా పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా పోటీలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఫుట్బాల్, వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలతో పాటు ఈస్పోర్ట్స్ కూడా నిర్వహించనున్నారు. మెన్ అండ్ ఉమెన్ పోటీలను వేర్వేరుగా నిర్వహించడంతో పాటు సుమారు రూ.5 లక్షల విలువైన బహుమతులను విజేతలకు అందజేయనున్నారు. ఈ నెల 25న జరిగే క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో ఈ బహుమతులను ప్రదానం చేయనున్నారు.క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను మంగళవారం యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ విర్ జి, అసిస్టెంట్ డైరెక్టర్ సుస్మితా సింగ్ లు పర్యవేక్షించారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్లతో పోటీల గురించి చర్చించి క్రీడాకారులకు అవసరమైన వసతి ఏర్పాట్లపై సమీక్షించారు.

# భారత్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీలలో వివా విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నిర్వహించిన ఖిభారత్ ఇన్నోవేషన్ ఛాలెంజ్202526 ఖి గ్రాండ్ ఫినాలేలో వివా ది స్కూల్ విద్యార్థులు బండి మిత్ర శ్రీ, అక్కినేని రన్విత రూపొందించిన ఖిహైజిన్ హ్యాకర్స్ఖి ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో సెకండ్ రన్నరప్ స్థానం లభించిందని వివా పాలక సభ్యురాలు వాసిరెడ్డి ప్రత్యూష తెలిపారు. యువ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించిన పోటీలలో దేశవ్యాప్తంగా సుమారు 2,600 బృందాలు, 10,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కాంతి ప్రభావంతో ఫోటో కెపాసిస్ విధానం ద్వారా పబ్లిక్ శానిటేషన్ రంగంలో నీటి వృధా, అపరిశుభ్రత, పెరుగుదల వంటి సమస్యల పరిష్కారానికి వివా




విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ సెకండ్ రన్నరప్‌గా నిలిచిందని ఆమె వివరించారు.ఈ సందర్భంగా మిత్ర శ్రీ, రన్వితలను వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ మహదేవ్, డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ సి.హెచ్. సరళ, మెంటార్ వై ప్రసాద రావు గారు మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# జెఈఈ మెయిన్2026 ఫలితాలలో భాష్యం అద్భుత ప్రతిభ

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** జెఈఈ మెయిన్ 2026 ఫలితాలలో భాష్యం ఐఐటి జెఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. మంగళవారం చంద్రమౌళినగర్ లోని భాష్యం మెయిన్ క్యాంపస్ లో ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ లో జరిగిన జెఈఈ



మెయిన్ పరీక్షలో టి.దుర్గా సుప్రభాత్ ఆంధ్రప్రదేశ్ నుండి 100 పర్సంటైల్ సాధించి చరిత్ర సృష్టించాడన్నారు. టి.దుర్గా సుప్రభాత్ 100 పర్సంటైల్ తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 11వ ర్యాంకును సాధించాడన్నారు. అదేవిధంగా వివిధ కేటగిరీలలో జె.సిహెచ్.వర్షిత్ ఆలిండియా 5వ ర్యాంక్, డి.పవన్ ఆలిండియా 6వ ర్యాంకు, టి. దుర్గా సుప్రభాత్ ఆలిండియా 11వ ర్యాంకు, ఆర్.బాలానాయక్ ఆలిండియా 24వ ర్యాంకు, కె. రామకృష్ణారెడ్డి ఆలిండియా 62వ ర్యాంకు, సిహెచ్.ప్రణయ్ ఆలిండియా 83వ ర్యాంకు, వై.యశస్వి ఆలిండియా 99వ ర్యాంకు, ఎం.బాలసాయిరామ్ ఆలిండియా 123వ ర్యాంకు, కె.కేశవకుమార్ సాయికృష్ణ ఆలిండియా 135వ ర్యాంకు, నూర్ బాషా హాఫీజ్ ఆలిండియా 140వ ర్యాంకు వంటి 150లోపు 10 అత్యుత్తమ ర్యాంకులతో పాటు ఆల్ ఇండియా 200లోపు 28 ర్యాంకులు, 500లోపు 60 ర్యాంకులు, 1000లోపు 82 ర్యాంకులు కైవసం చేసుకొని 73.24 సక్సెస్ రేట్ తో తమ సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కు గర్వకారణమైన విజయాన్ని అందజేసిన దుర్గా సుప్రభాత్ కు రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం మే నెలలో జరగబోయే జెఈఈ అడ్వాన్స్ కూడా తమ విద్యార్థులు ఘన విజయాలు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఘన విజయాలకు స్కూల్ స్థాయి నుండే మేమందించే భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే కారణమన్నారు. ఈ విజయానికి తోడ్పడిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, ఐఐటి ప్రోగ్రామర్ ఎం ఆనంద్ కుమార్ లు అభినందనలు తెలిపారు. సాయంత్రం 4 గం.ల నుండి భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో జెఈఈ మెయిన్ విజయోత్సవ ర్యాలీ మెయిన్ క్యాంపస్ నుండి విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కోలాహలంగా సాగింది.

# జేఈఈ మెయిన్స్ ఫలితాలలో మ్యాట్రిక్స్ అకాడమీ ఐఐటి విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో మాట్రిక్స్ ఐఐటి అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని అకాడమీ చైర్మన్ రామిరెడ్డి, డైరెక్టర్ వెంకటరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కే శ్రేషంత్ 99.29, ఆర్ సిద్ధార్థ 97.77, ఎల్ మనోజ్ సాయి 97.40, బి భువనేష్ 96.90, ఎస్ కోటేశ్వరరావు 95.93, ఎస్.కె రెహమాన్ 94.87, సిహెచ్ సాయి జస్వికా 94.90, బి హారిక 93.70, బి తిరుపతయ్య 93.56, పి షాగిల్ హుస్సేన్ 93.55, ఎల్ లీలా శ్రీకర్, 92.85, ఎం అఖిల్ 90.46 కేవలం 70 మంది విద్యార్థులలో 35 మంది జేఈఈ సాధించారన్నారు. అర్హత సాధించిన విద్యార్థినీ విద్యార్థులను అకాడమీ చైర్మన్ రామిరెడ్డి, డైరెక్టర్ వెంకటరెడ్డి లు అభినందించారు.



# నిస్సహాయ మృతునికి అంత్యక్రియలు నిర్వహించిన శ్రీశివలింగేశ్వర సేవాసమితి సభ్యులు

**తెనాలి, ఏప్రిల్21,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని గంగానమ్మపేటకు చెందిన సురగాని దుర్గారావు అనారోగ్య కారణంగా మంగళవారం ఉదయం మృతి చెందగా, అతని తల్లి కుమారి కోరిక మేరకు,శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.మృతుడు సురగాని దుర్గారావు మార్కెట్లో పండ్ల వ్యాపారం చేసేవాడని,గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉంటున్నాడని,కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో దుర్గారావు అతని తల్లి కుమారి అద్దె ఇంట్లో నివసిస్తున్నారని, అనారోగ్య కారణంగా మృతి చెందిన దుర్గారావు కి అంత్యక్రియల నిమిత్తం వారి కి తగు ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎవరు ముందుకు రాని స్థితిలో అతని తల్లి కుమారి, సహాయం కోరగా శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారు తమ సొంత వాహనంలో



పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో గల మహాప్రస్థానంలో మృతుడు దుర్గారావు కి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను మాట్లాడుతూ, గుంటూరు పట్టణానికి చెందిన స్వామి జ్ఞాన ప్రసన్న సూచనల మేరకు గత ఎనిమిది సంవత్సరాలుగా తెనాలి పట్టణంలో ప్రతిరోజు నిరాశ్రయులకు,అనాథలకు, ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనారోగ్యంతో,నిస్సహాయ స్థితిలో మరణించిన అనాథలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ అంత్యక్రియల్లో,పి.రాఘవ, పోతురాజు మరియు శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే రామాంజనేయులు

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా, చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించాలను కునేవారికి భారీగా రుణసాయం పెంచుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా ప్రాధికార సంస్థ (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని డ్వాక్రా మహిళ సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (విఓఏ) లకు స్మార్ట్ ఫోన్లు మరియు యూనిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరైమాట్లాడుతూ..వివోఏలు స్మార్ట్ ఫోన్ల ద్వారా డిజిటల్ పరిజ్ఞానం పొందుతూ లబ్ధిదారులకు సేవలు అందించాలని సూచించారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళా సంఘాల పిఓఏలకు రూ.39 కోట్లు వ్యయంతో 27 వేల మందికి ఫైవ్ జి స్మార్ట్ ఫోన్లు అందించినట్లు తెలియజేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని కాకుమాను, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలాలకు సంబంధించి 143 మంది వివోఏలకు స్మార్ట్ ఫోన్లు అందించినట్లు చెప్పారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ముగ్గురు లబ్ధిదారులకు ఎగ్ స్టాల్స్ ను నేరుగా అందించామన్నారు. పీఎం ఏజేఏవై పథకం కింద నలుగురు లబ్ధిదారులకు రూ.3 లక్షల విలువ గల ఆటోలు, ఆర్ శెట్టి ఆధ్వర్యంలో 22 మంది బోటిక్ నేషనల్ ట్రైనింగ్ సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని చూస్తున్న మహిళల కోసం ప్రభుత్వం స్త్రీనిధి రుణాల పరిమితిని భారీగా పెంచిందన్నారు. ఇప్పటివరకు లభిస్తున్న రూ.లక్ష రుణానికి అదనంగా ఇప్పుడు మరో రూ.2 లక్షల వరకు అదనపు రుణాన్ని మంజూరు చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇక సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలకు ఏకంగా రూ.4 లక్షల వరకు రుణ సాయం అందించనుందని, ఈ నిర్ణయంతో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు, కుటీర వ్యాపారాలు చేసుకునే మహిళలకు పెద్ద వరంగా మారనుందని తెలిపారు. ఈ అదనపు రుణ సదుపాయం అందరికీ కాకుండా కేవలం క్రమశిక్షణతో కూడిన సభ్యులకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. గతంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్న మహిళలకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తారని తెలియజేశారు. ఈ ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు సెర్ప్



అధికారులు రంగంలోకి వస్తారని, ప్రతి గ్రామ సంఘం నుంచి సుమారు 15 మంది సభ్యులను ఎంపిక చేసి, వారికి ఈ ఆర్థిక వెసులుబాటును కల్పిస్తారని వివరించారు. సభ్యుల గత రికార్డులను పరిశీలించిన తర్వాతే ఈ రుణాలకు ఆమోదం తెలుపుతారని వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఆర్ శెట్టి డైరెక్టర్ సందీప్, ఏపీఎంలు ఎం. సుబ్బారావు (పెదనందిపాడు), వి. లాజర్ (ప్రతిపాడు), జి.సుజాత (కాకుమాను), పి.షాలేంరాజు (గుంటూరు రూరల్), ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నార్నె బాబు, టిడిపి నేతలు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, మర్రి సాంబశివరావు, నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గంలోని ఎమ్మెస్ ఓబి నంబర్లు, సీసీలు, వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలంటూ మహా సుదర్శన హోమం

**మంగళగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కొణిదెల పవన్ కళ్యాణ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో



పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగు పడాలని కోరుతూ, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి రాధా దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం మంగళాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో మహా సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్ హాజరై ఈ మహా యాగంలో ముఖ్య ఘట్టమైన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఏపీఎంఎస్ఐడిసి చైర్మన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య , పార్టీ సీనియర్ నాయకులు చందు సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హరి ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఒక సమావేశంలో కళ్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. వ్యక్తిగత డాక్టర్ల సలహా మేరకు ఆయనకు శస్త్ర చికిత్స చేయించుకున్నారన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు గంజి చిరంజీవి ఈ మహా యాగాన్ని ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దేవుడి ఆశీస్సులతో, ప్రజలందరూ అభిమానంతో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూన్నాను అని తెలిపారు. గంజి చిరంజీవి మాట్లాడుతూ కొణిదల పవన్ కళ్యాణ్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఈ సుదర్శన హోమాన్ని జరిపించడం జరిగిందని అన్నారు. దీని ఫలితం పవన్ కళ్యాణ్ కు దక్కాలని కోరుకున్నారు. ఒక హీరోని దేవుడిగా భావించే గొప్ప అభిమానులను సంపాదించుకున్న యువ కెరటం కళ్యాణ్. ఇప్పటికే ఎన్నో చోట్ల అభిమానులందరూ పూజలు, హోమాలు, ప్రార్థనలు చేస్తున్నారు. మనందరి ప్రేమ, దేవుడు ఆశీస్సులతో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.అలాగే వేద పండితులు జనకుల గోత్రస్య, మకర రాశి, ఉత్తరాషాడ నక్షత్రస్య, కొణిదల పవన్ కళ్యాణ్ నామదేశ్య, ఉన్నత ఆరోగ్యం ఫలసిద్ధిరస్తు అంటూ హోమం ద్వారా ఆశీర్వచనాలు కళ్యాణ్ కు అందించారు.హోమం అనంతరం స్వామివారికి , అమ్మవారికి పూలు, ఫలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు...ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి జంజనం శివ పార్వతి, తాడేపల్లి మండల అధ్యక్షులు సోమల నాగేశ్వరావు, అంబటి తిరుపతిరావు, లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డ్ మెంబర్ భళ్లా ఉమామహేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్, దామర్ల నాగలక్ష్మి, పార్టీ నాయకుల, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు పంపిణీకి సన్నద్ధం

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పాఠశాలలు తెరిచే నాటికి రాష్ట్ర ప్రభుత్వము అన్ని పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ



చేసేందుకు సన్నద్ధంగా ఉన్నదని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష అన్నారు . అమరావతి రోడ్డు లోని పాఠ్యపుస్తకాల గోడౌన్ను తనిఖీ చేసి ఈ సందర్భంగా టెస్ట్ బుక్ మేనేజర్ వి వజ్రబాబు ను అడిగి అన్ని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 లక్షల 84 వేల 322 పుస్తకములు ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు అవసరం అవ్వగా ప్రస్తుతం 9 లక్షల 67 వేల 938 పుస్తకాలు జిల్లా గోడెన్ కు రావడం జరిగిందని మిగిలిన పుస్తకాలు కూడా రెండు రోజుల్లో రావడం జరుగునని,వచ్చే నెల ఒకటో తేదీ నుండి ఆర్టీసీ కార్గో ద్వారా ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు పంపనున్నట్లు, ఒకటో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు మారిన సిలబస్ ప్రకారం పుస్తకాలు వచ్చినట్లు సలీం భాష తెలిపారు పాఠ్యపుస్తకాల మేనేజర్ ఈ విషయంలో ఎటువంటి తేడా లేకుండా సరఫరా జరిగేటట్లు చూసుకోవాలని వారు అన్నారు పాఠ్యపుస్తకాల మేనేజర్ వజ్రబాబు మాట్లాడుతూ తప్పక ప్రభుత్వ నిబంధనల ప్రకారము ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారము పాఠ్యపుస్తకాలు ఆర్టీసి కార్గో ద్వారా సరఫరా చేసేందుకు మా సిబ్బందితో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల ఉపతని ఖి అధికారి ఎండీ ఖాసీం మరియు సిబ్బంది పాల్గొన్నారు

# నేటి నుండి నోవహు సువార్త పండుగలు ప్రారంభం

**తెనాలి ఏప్రిల్21(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని ఐతానగర్ లోగల నోవహు చర్చ్ నిర్వాహకులు పాస్టర్ కే. విలియం కేరి నిర్వహించే సువార్త పండుగలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు విలియం కేరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడిస్తూ, సువార్త సభలు ఏప్రిల్ 22బుధవారం నుండి 24వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహణకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సువార్త పండుగలకు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు. సువార్త పండుగ సభలు ఐతానగర్ లోని సత్యం స్మారక ప్రాంగణం పక్కన జడ్పీ అంకినీడు ప్రసాద్ స్థలంలో జరుగుతాయని పేర్కొన్నారు. నోవహు మినిస్ట్రీస్ ఫౌండర్ దివంగత బిషప్ ఇస్రాయేలు ఆశయాలను ముందుకు తీసుకెళుతూ,సమాజానికి దేవుని వర్తమానాన్ని అందించడమే లక్ష్యం అన్న ఉద్దేశంతో ఈ సువార్త పండుగలు 24వ సంవత్సరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సువార్త పండుగలకు నోవహు చర్చి సంఘ పెద్దలు సంఘస్తులు యవనస్తులు స్త్రీల సమాజం వారు సహకరిస్తారని వెల్లడించారు. మూడు రోజులపాటు జరిగే సువార్త పండుగలకు వాక్యోపదేశకులుగా పాస్టర్ కే. కాంతారావు మరికొందరు ప్రముఖ దైవ సేవకులు కొనసాగుతూ దేవుని వర్తమానాన్ని అందిస్తారని పేర్కొన్నారు.ఈ సభలకు తెనాలి పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఆహ్వానితులేనన్న అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. రండి స్తుతించి దేవుని ఆరాధిద్దాం దేవుని వాక్యాన్ని ఆస్వాదిద్దాం అన్న పిలుపుతో ప్రేమపూర్వకంగా అందర్నీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



# తాగునీటి సరఫరాలో రాజీ పడొద్దు మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ, ఏప్రిల్21(,ప్రభాతవార్త):** ప్రజలకు అందించే తాగునీటి సరఫరాలో రాజీ పడొద్దని, స్వచ్ఛమైన,శుభ్రం ముఖ్యమని మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని ఉడా కాలనీ లో గల



పురపాలక సంఘం సేంద్రియ కూరగాయల సాగు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది కి పలు సూచనలు చేశారు. కూరగాయల సాగు, మొక్కల పెంపకం వంటి అంశాలపై సిబ్బంది తో మాట్లాడారు. అనంతరం వీఎస్ఆర్ కళాశాల వద్ద గల రక్షిత మంచి నీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నీటి శుద్ధి కేంద్రాన్ని,నీటి సరఫరా రికార్డు లను,నీటి నాణ్యతను పరిశీల్నిచారు. నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించి, ప్రజలకు నాణ్యమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కె. శ్రీనివాసరావు, ఇంచార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ దార రాజేష్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# కాలువల్లో షిల్ట్ ను ఎప్పటికప్పుడు తొలగించండి : ఎంహెచ్ఓ ఏసుబాబు

**తెనాలి మున్సిపాలిటీ, ఏప్రిల్21,(ప్రభాతవార్త):** మురుగు కాలువల్లోని షిల్ట్ ను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగునీటి పారుదలకు అడ్డంకులు తొలగిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని పట్టణ ఆరోగ్యాశాఖ అధికారి మొవ్వ ఏసుబాబు పారిశుధ్య సిబ్బందికి సూచించారు. స్వచ్ఛ తెనాలి సాధించుటలో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలని మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని ఎంహెచ్ఓ ఏసుబాబు సూచించారు. మంగళవారం, పట్టణం లోని 23 వ వార్డు.ఆర్ ఆర్ నగర్,28వ వార్డు ఆలపాటి నగర్ లో జరుగుతున్న గ్యాంగ్ వర్క్ ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.కాలువలలో పూడికను తీయించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సానిటరీ ఇన్స్పెక్టర్ కు సూచించారు. కాలువ లలో తీసిన సిల్ట్ ను వెంటనే తరలించాలని చెప్పారు.ఎంహెచ్ఓ వెంట సానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు



# భక్తునికై సాక్ష్యమిచ్చిన భక్తవత్సలుడు
# పొన్నూరు సాక్షి భావనారాయణస్వామి

**పొన్నూరు, మే 21,ప్రభాతవార్త:**

**"ప్రభుర్భావదేవ: ఫలాని ప్రదద్యాత్, విలసేక్షణై రాశ్రితాళేం కృపాళు:**
**విలోలాలక స్వర్ణపురీశ్వరోవ్యాత్, కలౌ నాస్తి దైవం పరం భావదేవాత్"**

**ఆంధ్రదేశంలో** గల అనేక దివ్య క్షేత్రాలలో శ్రీ భావనారాయణస్వామి వెలసిన ఐదే క్షేత్రాలు జగత్రసిద్ధాలు. అవి స్వర్ణపురి(పొన్నూరు), భావపురి(బాపట్ల), బావదేవరపల్లి, సర్పవరం, పట్టసం. సస్యశ్యామలమైన పంట భూములతో అలరారే పొన్నూరును గతంలో 'స్వర్ణపురి' అని పిలుస్తుండేవారు. వ్యవసాయకంగా, వ్యాపారపరంగా దినదినాభివృద్ధిని సాధిస్తున్న పొన్నూరుకు "స్వర్ణపురి" నామం సార్థకమేనని అంటున్నారు.



అయితే పొన్నూరుకు 'స్వర్ణపురి' అనే పేరు రావడం వెనుక రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి. సృష్టి చేయడానికి సంకల్పించిన బ్రహ్మ, ముందుగా శ్రీమన్నారాయణుని గూర్చి తీవ్రమైన తపస్సు చేశాడు. ఆ తపస్సు ఫలించి, నారాయణుని అనుగ్రహం పొందిన బ్రహ్మ, సృష్టి రహస్యాలను గ్రహించాడు. అలా తపస్సు చేస్తున్న సమయంలో బ్రహ్మ, స్నానపానీయాలకై ఓ సరోవరాన్ని ఉపయోగిస్తుండేవాడు. కాలక్రమంలో అదే 'శ్రీబ్రహ్మ సరోవరమని' పిలువబడి శ్రీవారి కోనేరుగా రూపొందింది. ఇక్కడే వాణీపతికి, రమాపతికి గోష్ఠి జరిగినందున 'గోష్ఠీవనం' అనే పేరుతో కూడా పిలువబడుతోంది. అదేవిధంగా పూర్వకాలంలో ఈ క్షేత్రం చక్రాకారంలో ఉండి, స్వామి ఆ చక్రాకార మధ్యభాగంలో ఉండటం వల్ల 'సుదర్శన క్షేత్రం' అని కూడా పిలువడుతుండేదట. సాక్షాత్ శ్రీమన్నారాయణుడే ఇక్కడకు వచ్చి స్థిరపడటం వల్ల ఈ ప్రాంతంలో పాడిపంటలకు, సిరిసంపదలకు లోటు ఉండేదికాదు. ఎటు చూసినా ఐశ్వర్యం తాండవమాడుతుండేదట. అందుకనే ఈ ప్రాంతాన్ని 'స్వర్ణపురి'గా పిలిచేవారని చెప్పబడుతోంది. క్రమంగా 'స్వర్ణపురి' అనే పేరు మరుగున పడి 'పొన్నూరు' గా పిలవడుతోంది. వైకుంఠవాసి అయిన శ్రీమన్నారాయణుడు కృతయుగంలో యజ్ఞేశ్వర రూపంలో పూజింపబడ్డాడు. ఆ నారాయణునే, కాశీపుర వాస్తవ్యుడైన అత్రి మహాముని తన మనోభావనా బలమున సాక్షాత్కరించుకొని భావనారాయణ స్వామిగా వేంచేయమని వేడుకున్నాడు. ఆ భావనారాయణుడే ఇక్కడ 'సాక్షి' భావనారాయణస్వామిగా భక్తజనకోటిని అలరిస్తున్నాడు. ఈ స్వామిని 'సాక్షి' భావనారాయణస్వామి అని పిలవడం వెనుక ఓ ఆసక్తికరమైన ఉదంతం ఉంది.

**సాక్ష్యమిచ్చిన స్వామి:** పూర్వం కేశవశర్మ అనే బ్రాహ్మణుడుండేవాడు. బహుకాలంగా సంతాన భాగ్యం లేని కేశవశర్మకు తీర్థయాత్రలు చేస్తే సంతాన సౌభాగ్యం కలుగుతుందని విప్రోత్తములు చెప్పారు. వెంటనే భార్య, తన మేనల్లుడు 'గూని' గోవిందశర్మను తీసుకొని తీర్థయాత్రలకు బయలుదేరాడు. అలా దేశంలోని అతి ముఖ్యమైన క్షేత్రాలను దర్శించుకున్న కేశవశర్మ చివరకు వారణాసికి చేరాడు. అక్కడ గంగా స్నానం చేసి స్వామి దర్శనం చేస్తూ పూజాది కార్యక్రమాలను ముగించుకుని దానధర్మములు చేస్తుండగా కేశవశర్మ మేనల్లుడు ఓ కోరికను వెల్లడించాడు. ఆడపిల్ల పుడితే తనకిచ్చి పెళ్ళి చేయాల్సిందిగా కోరిన గూని గోవిందుడిని చూసిన శర్మ నవ్వుతూ అలాగేనని తలాడించాడు. కేశవశర్మ ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నప్పటికీ గూని గోవిందుడు మాత్రం భావనారాయణ స్వామి సాక్షిగా కన్యాదాన బలమును దారాగృహీతము చేయాల్సిందిగా పట్టుబట్టాడు. కేశవశర్మ కూడా కన్యాదాన బల దారాగృహీతము చేశాడు.

తర్వాత కొంత కాలానికి కేశవశర్మ దంపతులకు ఓ అందమైన ఆడపిల్ల పుట్టింది. ఆమెకు 'అక్కలక్ష్మి' అనే పేరుపెట్టి ఎంతో అల్లారుముద్దుగా పెంచసాగారు. అందాల బరిణె అక్కలక్ష్మికి యుక్తవయసు రాగానే గూని గోవిందునికిచ్చిన మాటను మరచిపోయిన కేశవశర్మ వేరే సంబంధాలు చూడసాగాడు. ఈ సంగతి తెలుసుకొన్న గూని గోవిందుడు తనకిచ్చిన మాట గురించి, అందుకు భావదేవుడు సాక్ష్యమున్న సంగతిని ప్రస్తావించగా, వీలయితే ఆ భావదేవుడ్నే తీసుకునిరా...అప్పుడు చూసుకుందామని కేశవశర్మ అహంకారంతో పలికాడు. దిక్కుతోచని గూని గోవిందుడు ఆత్మశక్తితో కాశీకి చేరుకుని, పరమాత్ముని వేడుకొనగా, భక్తాభిమానంతో బయలుదేరిన

**తన భక్తుని కోసం వైకుంఠం నుంచి దిగి వచ్చిన నారాయణుడు తిరుగులేని సాక్ష్యమిచ్చి 'సాక్షి' భావనారాయణస్వామిగా పొన్నూరులో అవతరించాడు. ఆయన మహిమలు అశేష భక్త జనకోటికి ప్రమోదం. సాక్షాత్ బ్రహ్మాది దేవతలే నడయాడిన ఈ ప్రాంతం ఆధ్యాత్మిక సరోవరం.**

భావనారాయణస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామిని, పేరులేని పెద్దమ్మను, పొన్నమానును, తుంగభద్ర, అత్రి మొదలైన మహాఋషులను వెంటబెట్టుకుని, గోష్ఠీవనానికి వచ్చి, సకల లోకాలు ఆశ్చర్యపోయేవిధంగా వివాహ సాక్ష్యమిచ్చాడు. ఆనాటి నుంచి స్వామి 'సాక్షి భావనారాయణస్వామి'గా పిలువబడుతున్నాడు.

**రాజులసేవ:** కృతయుగంలో ఈ సంఘటన జరిగిన ప్రదేశంలోనే శ్రీమన్నారాయణుడు ఓ పుట్టలో నిగూఢంగా ఉండగా యుగాలు గడిచిపోయాయి. క్రీ.శ. 8వ శతాబ్దంలో రాయలసీమ, ఔకుసీమ జమీందారు అందెల నారపరాజు ఈ ప్రాంతానికి వచ్చారు. ఆ రోజు రాత్రి జమీందారు కలలో కనబడిన స్వామి తాను పుట్టలోనున్న సంగతిని వెల్లడించాడు. భక్తి ప్రపత్తులతో స్వామివారిని బయటకు రానించిన జమీందారు, స్వామి పాదపద్మములందున్న చందన తులసీదళములతో వీపునున్న రాచపుండును నయం చేసుకున్నారు. తరువాత శ్రీవారికి దేవాలయ నిర్మాణం చేయించి ఆగమశాస్త్ర ప్రకారం శాశ్వత అర్చనాదికములు జరిగేందుకు తగు ఏర్పాట్లు చేసి, దైవపూజలందుకుంటున్న స్వామిని, మానవులు పూజ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. క్రీ.శ. 9వ శతాబ్దంలో రాజా కుళోత్తుంగ చోళుడు స్వామికి మండపాలని నిర్మించగా, ఆ తర్వాత అనేకమంది చక్రవర్తులు, రాజులు స్వామిని సేవించి తరించారు. 17వ శతాబ్దంలో గుంటూరు జిల్లాలోని రాచూరు జమీందారు మాణిక్యారాయనిం గారి పరిపాలనలోనున్న శ్రీవారి దేవాలయమును, అమరావతి ప్రభువులు శ్రీ రాజావాసిరెడ్డి వేంకటాద్రినాయుడు బహద్దూర్ మన్నెసుల్తాన్ దొర, దేవాలయ అనువంశిక ధర్మకర్త ృత్వపు హక్కును రాచూరు వారి నుండి పొందారు. అప్పటి నుండి వాసిరెడ్డి వంశీకుల ధర్మకర్తృత్వము కొనసాగుతోంది. శ్రీవారి బ్రహ్మోత్సవములు వైశాఖ పౌర్ణమికి వైభవోపేతంగా జరుగుతుంటాయి. ఇంకా ఈ గోష్ఠీవన ప్రాంగణంలో శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం, కాశీ విశాలాక్షి దేవాలయం, శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, సన్నిధ్ధరాళ్వార్లు, శ్రీ విఖనసాచార్యస్వామి, శ్రీ గరుడాళ్వారు, శ్రీ దాసాంజనేయస్వామి ఆలయాలున్నాయి.

**23నుంచి ఉత్సవాలు: అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ**

23వ తేదీ రాత్రి 9గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఋత్వికవరణం, మృత్సంగ్రహణము, అంకురారోపణము, హోమము, బలిహరణ, ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు.(విశేష గరుడ ప్రసాద వితరణ) ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు 10గంటలకు స్వామివారికి పంచామృత స్నపన తిరుమంజనోత్సవము జరుగుతాయన్నారు. 24న శేషవానంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 25న హంస వాహనము, 26న హనుమద్వాహనము, 27న సింహ వాహనము, 28న రాజాధిరాజ వాహనము, 29న పొన్నవృక్ష వాహనము, 30వ తేదీన రాత్రి 8గంటలకు గజ వాహనము, గ్రామోత్సవం, ఎదురు కోలోత్సవం, రాత్రి 12గంటలకు దివ్య కళ్యాణోత్సవం జరుగుతాయన్నారు. మే 1వ తేదీన ఉదయం 5గంటలకు గరుడ వాహనము, సాయంత్రం 4గంటలకు దివ్య రథోత్సవము జరుగుతాయన్నారు. 2వ తేదీన



ఉదయం వసంతోత్సవం, 10గంటలకు చక్రస్నానము, రాత్రి 8గంటలకు ధ్వజావరోహణము(గరుడ ప్రసాద వితరణ) రాత్రి 9గంటలకు హయవాహనముపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 3వ తేదీన బ్రహ్మ సరోవరంలో శ్రీవారి తెప్పోత్సవము, రాత్రి 9గంటలకు ద్వాదశ ప్రదక్షిణములు, పర్యంకోత్సవము ఏకాంతసేవలు జరుగుతాయన్నారు. 4,5తేదీలలో స్వామివారి ఏకాంత సేవలు జరుగుతాయన్నారు. ఈ పవిత్ర పుణ్య దినములలో స్వామివారి అర్చన విశిష్ట ఫలితాన్ని ఇస్తుందన్నారు రూ.1,116లు చెలి ంచిన భక్తుల గోత్రనామాలతో 9రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, చివరి రోజున శేషవస్త్రము, ప్రసాదములు ఇవ్వబడుతుందన్నారు. ఒక్క రోజు వాహన సేవకు రూ1,116లు చెలి ంచి రశీదు పొందాలన్నారు. ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఉత్సవాలను తిలకించి స్వామివారికి ఆశీస్సులు అందుకోవాలని కామేశ్వరమ్మ కోరారు.

## అబద్దాలతో రాజకీయం చేయలేరు : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** అబద్దాలతో రాజకీయం చేయలేరని, ప్రజలకు నిజాయితీ ముఖ్యమని, ఆ నిజాయితా మాదగ్గర మాత్రమే ఉందని, అందుకు ప్రజలు మమ్మల్ని విశ్వసిస్తున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. గత మీ పరిపాలనలో మీ నాయకులు చేసిన విధానాల్ని ఈ రోజు నీవు నా మీద బురద జల్లాలని ప్రయత్నం చేస్తున్నావు. నా రాజకీయ జీవితంలో ప్రతి రోజు రైతుల కోసమం పోరాటం చేశాను. నా సూచనలతో ఎడిఎ అగ్రికల్చర్ ద్వారా 6-4-26వ తేదీన జిల్లా వ్యవసాయాధికారికి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు కేటాయించాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కూడా ఏపి మార్క్‌ఫెడ్ వారికి 9-4-26న కొనుగోలు కేంద్రాల గురించి లేఖ రాయండం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇరు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉన్నందువల్లే జాప్యం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో మీ పార్టీ వారు చేసిన విధానాలు ఎదుటివారిపై ఆరోపించడం సబబుకాదన్నారు. సంఘం డెయిరీ శ్రమ దోచుకునే సంస్థ కాదన్నారు. రైతుల శ్రేయస్సు కోరే సంస్థ అని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యూరియా, డిఏపి జిల్లాలో అత్యధికంగా పంపిణీ చేసిన నియోజకవర్గం పొన్నూరు మాత్రమేనన్నారు. గణాంకాలు పరిశీలించుకొని చూసుకోవాలన్నారు. నీకు పొన్నూరు ప్రజలపై అమితమైన ప్రేమ ఉంటే పొన్నూరు నియోజకవర్గాన్ని దివాళాకోరు నియోజకవర్గం అని సంబోధించేవాడివి కాదన్నారు. ప్రజలు దృష్టి మళ్లించడానికి తప్పుడు దీక్షలు, తప్పుడు నిరసనలు, అసత్య ఆరోపణలతో నిత్యం మీ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్నది ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే నీ కంటే నేనే ముందుంటానన్నారు. ఎల్లప్పుడూ నియోజకవర్గ అభివృద్ధికి తాను, టిడిపి కట్టుబడి ఉంటుందన్నారు.



## మీరు చేసే సేవ భవిష్యత్తు తరాలకు ఆదర్శం

**-స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్**

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** ప్రతి పెద్ద మార్పు చిన్న చర్యలతోనే ప్రారంభమవుతుంది. మీరు చేసే ప్రతి మంచి పని సమాజంలో వెలుగునిస్తుంది. మీరు కేవలం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మాత్రమే కాదు...మీరు సమాజానికి మార్గదర్శకులు. మీరు చేసే సేవ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ వర్సిటీలోని యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్‌యాక్టివిటీ కౌన్సిల్(యూఈఏసీ) విద్యార్థుల ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఎన్ఎస్ఎస్ వాలెడిక్టరీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ ఈ రోజు ఒక మొక్క నాటండి...అది రేపు మన భూమిని, మన భవిష్యత్తును కాపడుతుందన్నారు. స్ప్రెడ్ గ్రీన్ అనేది కేవలం నినాదం కాదు, అది మన బాధ్యత. అలాగే సేవ్ బ్లూ అంటే నీటిని సంరక్షించాలి. నీరే లేకపోతే జీవం ఉండదు. కాబట్టి ప్రతి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ పర్యావరణ పరిరక్షణలో ముందుండాలి అని కోరారు. రక్తదానం గురించి మాట్లాడుతూ రక్తదానం మహాదానం. ఒక యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముందుండి రక్తదాన శిబిరాలు నిర్వహించి, మరింత మంది యువతను ప్రేరేపించాలి. మనం ఇచ్చే రక్తం ఎవరో ఒకరి కుటుంబానికి కొత్త జీవితం ఇస్తుందన్నారు. అంతేకాకుండా, యూనివర్సిటీ పరిధిలోని ఐదు గ్రామాలను (శలపాడు, వడ్లమూడి, వీరానాయకునిపాలెం, వేజండ్ల, సుద్దపల్లి) దత్తత తీసుకోవడం, సంవత్సరం పొడవునా 140కి పైగా సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. టీమ్ వర్క్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక్కరితో సాధ్యం కానిది, కలిసి చేస్తే సాధ్యమవుతుందన్నారు. టీమ్‌గా పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ప్రతి సభ్యుడి సహకారం, సమన్వయం విజయానికి దారి తీస్తుంది. కలిసి పనిచేసే సంస్కృతి మీలో పెంపొందాలి అని చెప్పారు. యువతకు ప్రేరణనిస్తూ మీరు పెద్ద కలలు కనాలి. మీ లక్ష్యాలు గొప్పవిగా ఉండాలి. ఆ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలి. ప్రతి పెద్ద విజయం చిన్న చిన్న అడుగులతోనే ప్రారంభమవుతందన్నారు. స్వచ్ఛతపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ స్వచ్ఛ భారత్ ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మన ఆరోగ్యం, మన సమాజం రెండూ అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, ఆయా విభాగాల డీన్లు,అధిపతులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సేవకుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి : మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** ప్రజా సేవకుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, జనసేన



పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రాభివృద్ధిలో దూసుకుపోతున్న పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని జన బాహుళ్యంలోకి రావాలని భగవంతుని ప్రార్థించారు. అనంతరం కిలారి, గాదె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు జనసేనాని ఎంతో శ్రమించారన్నారు. అదేవిధంగా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి తేవడంలో కూడా తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై రాష్ట్ర ప్రజానీకం ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటన్నింటిని వమ్ము చేయకుండా నెరవేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా కార్యదర్శి, జనసేన పార్టీనాయకుడు మాదాసు అప్పారావు, కొ్ట్ర నాంచారయ్య,విన్నకోట సురేష్, బాపట్ల చంద్రమోహన్, శిఖ బాల కోటేశ్వరరావు, చట్టాల త్రినాథ్, చందనపు నాగరాజు, షేక్ కరీముల్లా, మేకల రామయ్య, యరసాని నాగభూషణరావు, ఎక్కటి రామయ్య, వీరెళ్ళ వెంకటేశ్వరరావు, జజ్జల శ్రీనివాసరావు, గోపాలం అశోక్, వేముల నారాయణ, తమర్చి సురేష్, పత్తి సురేష్, సూరిబాబు, శ్రీనివాసకృష్ణ, ఎలవర్తి ఫణి, తదితరులు పాల్గొన్నారు.

## జొన్న,మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి : వైకాపా పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** జొన్న-మొక్కజొన్న రైతులకు గిట్టు బాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైకాపా పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన రైతు పోరాట దీక్ష కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. గత వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహనరెడ్డి హయలో రైతులు పండించే అన్ని పంటలకు ముందుగానే మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని, వారి పక్షాన పోరాటం చేసేందుకు ఈ నెల 23వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదురు గల ధర్నా చౌక్‌లో రైతు పోరాట దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వానికి తెలిసేలా దీక్షలో పాల్గొనాలని షేక్ నాజర్ పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను, గోడపత్రికలను ఆవిష్కరించారు.



ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వరరావు, జంగమయ్య, డక్కుమళ్ళరవి, మాజీ కౌన్సిలర్ ముక్కాల విజయబాబు, షేక్ గౌస్ బాషా,మంద్రు అనిత, గేరా సంజీవ్, పీర్‌సాహెబ్, చందోలు ఇమ్మానియేలు, వేముల మూర్తిరాజు, మిక్కిలి జాన్, గోపిశెట్టి శ్రీనివాసరావు, జి.రోశయ్య, గేరా రాజేంద్ర, మేకల సురేంద్ర, విజయ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ముఖ్యం సమాచారం గోప్యం : తహశీల్దార్

**కొల్లిపర,ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** జనగణన అత్యంత ప్రాధాన్యతగా బావించి నమోదు చేయాలని చెబుతూ సేకరించిన సమాచారాన్ని కూడా గోప్యంగా



ఉంచుతామని తహశీల్ధార్ గుమ్మడి సిద్దార్థ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనాభా గణనపై ఎన్యూమరేటర్లు..సూపర్‌వైజర్లకు శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఎ.ఎస్.ఓ మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణలో సిద్ధార్థ ప్రసంగిస్తూ ప్రతి ఇంటిని..ప్రతి వ్యక్తి వివరాలు తప్పక నమోదు చేయాలని స్పష్టం చేసారు. దేశ ప్రగతి..భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జనాభా గణన అత్యంత కీలకం అన్నారు. జనాభా గణన చేసేటప్పుడు నిర్లక్ష్యం పనికి రాదని చెబుతూ..ప్రతి ఒక్కరితో స్నేహ పూర్వకంగా మెలుగుతూ.. ఓర్పుతో సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్, డిప్యూటి తహశీల్ధార్ రాజేష్;శిక్షకులు కె.సురేష్‌బాబు, ఈదా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్దతులు పాటించండి నాణ్యమైన దిగుబడులు పొందండి

**-ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి**

**కొల్లిపర,ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వ్యవసాయంలో యాజమాన్య పద్దతులు పాటిస్తూ..నాణ్యమైన దిగుబడులు పొందాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోటలో ప్రకృతి వ్యవసాయంపై



మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి అధికారులతో కలసి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతూ భూమి యొక్క ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. సీనియర్ శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు ఎక్కువుగా వాడటం వలన పంటలు తెగుళ్ళ బారిన పడుతున్నాయన్నారు. భూములు కూడా రాను రాను చౌడుభూములుగా మారే ప్రమాదముందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయుటం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడిఏ విజయ్‌బాబు, వ్యవసాయాధికారులు రాజవంశీ,ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

## సౌకర్యాలు కల్పించాం.. ఉపాధిపనులు చేసుకోండి : ఇన్‌చార్జి ఎంపీడీఓ

**కొల్లిపర,ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ఉపాధిహామీ పనుల్లో పాల్గొను కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించామని చెబుతూ..కూలీలు ఈ పథకాన్ని సద్వినియోగం



చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం..మున్నంగి..అత్తోట, కొల్లిపర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీలను ఏపివో వెంకయ్యతో కలసి ఆయన పరిశీలించి కూలీలకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరిగాయని కూలీలు తగిన జాగ్రత్రలు తీసుకోవాలన్నారు. కూలీలకు కొలతలను బట్టి వేతనం చెల్లించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూమిని ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**గుంటూరు విద్య ఏప్రిల్ 20 ప్రభాతవార్త :** దళితుల భూములను అన్యాయంగా ఆక్రమించే కబ్జాదారులపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొందరు దగాకూరు నాయకులు రాజకీయ పార్టీల పేరు చెప్పి కబ్జాదారుల అవతారమెత్తి గుంటూరు తారకరామా నగర్ లోని ఒక దళిత రాష్ట్ర నాయకునీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వారికి సంబంధించిన సొంత భూమిలో కొందరు అధికారంలో ఉన్న పార్టీ పేరు చెప్పుకొని భూమిపై దౌర్జన్యం చేస్తున్నారని ఏసుబాబు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. 1994లో వారి తండ్రి బిజెపిలో దళిత మోర్చాలో రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నప్పుడు స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుంటూరు గోల్డెన్ కంపెనీ సమీపంలోని ఖాళీ స్థలంలో పేదలకు ఆ భూములు ఇచ్చారని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. ఎన్టీఆర్ గౌరవార్థం ఆ ప్రాంతానికి అప్పట్లో తారకరామా నగరమని పేరు కూడా పెట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తన తండ్రి సుబ్బారావు కూడా కొంత స్థలం పొందారని అన్నారు. ఇప్పుడు కొంతమంది అధికార పార్టీ పేరు చెప్పుకొని ఆ భూమిపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో శంకర జయంతి వేడుకలు



**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో బ్రాహ్మణ బజారులో వేంచేసియున్న శ్రీ శంకరమఠంలో మంగళవారం శంకర జయంతి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. జయ జయ శంకర....హర హర శంకర అనే భక్తుల నినాదాలతో స్వర్ణపురి పట్టణ పురవీధులు మార్మోగిపోయాయి. శ్రీ శంకరాచార్యులువారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపైకి వేంచేపుచేసి పట్టణంలో ఊరేగించారు. మేళ తాళాలతో, మహిళా భక్తులు కోలాట ప్రదర్శనతో స్వర్ణపురి పట్టణంలో స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. శంకర మఠం నుంచి బయలుదేరిన ఊరేగింపు తెలగపాలెం రామమందిరం మీదుగా తాలూకా, గాంధీబొమ్మ సెంటర్, తోటమ్మతల్లి దేవాలయం, కూరగాయల మార్కెట్, ఐలాండ్ సెంటర్ మీదుగా ఎస్పీపీరోడ్డు నుంచి షరాఫ్ బజారు మీదుగా తిరిగిశంకరమఠం వరకు సాగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బ్రాహ్మణ మహాసభ పూర్వాధ్యక్షుడు పివిఎస్ఎస్వి ప్రసాద్, అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, కోశాధికారి ఎఆర్‌కెఎస్టీ సాయి, కోశాధికారి దేశిరాజు బాలగంగాధర తిలక్‌ల పర్యవేక్షణలో సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్థానిక వీరాంజనేయస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధా రంగ మిత్ర మండలి జిల్లా కన్వీనర్ యన్నం నాయుడు మోకాళ్ళపై దేవాలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం కూటమి నాయకులంతా శ్రీ వీరాంజనే యునికి తమలపాకుల పూజ నిర్వహించారు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ పేరు మీదు త్వరగా కోలువాలని



పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు షేక్ బాజిసాహెబ్, గోవాడ వెంకటకృష్ణారావు, మగ్బుల్‌బేగ్, దాసరి విజయకుమార్, యరసాని శ్రీరామమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 26న గజేంద్ర మోక్షణం పై ప్రవచనం

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** ప్రతిమాసం వాణీదరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6.30గంలకు గజేంద్ర మోక్షణం(శ్రీమద్భాగవతము) అనే అంశంపై ప్రవచనం జరుగుతుందన్నారు. మార్కాపురం జిల్లా కంభం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు పాపిశెట్టి శశికుమార్ ప్రవచనం చేస్తారన్నారు. బ్రాహ్మణ బజారులోని శంకరమఠంలో జరిగే ఈ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు, సాహిత్య పోషకులు, కళాభిమానులు, కళాపోషకులు, తెలుగు భాషాభిమానులు, ప్రజలు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు గణపరవపు రామశాస్త్రి, ఎఆర్‌కెఎస్టీ సాయి, కోశాధికారి దేశిరాజు బాలగంగాధరతిలక్ కోరారు.

## నందివెలుగులో పారిశుద్ధ్య నిర్వహణ పై తహశీల్దార్ ఆగ్రహం

**తెనాలి,ఏప్రిల్21,(ప్రభాతవార్త):** తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో తహసీల్దార్ కెవి.



గోపాలకృష్ణ ఆకస్మికంగా పర్యటిం చారు. గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్న ఆయన మంగళవారం ఉదయాన్నే పంచాయితీ అధి కారులు సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను గుర్తించి పంచాయితీ సిబ్బందిని ప్రశ్నించారు. రెండు రోజుల్లోగా మొత్తం ఆక్రమణలను తొలగిం చాలని ఆదేశించారు. గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాలువల దుస్థితిని గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలోని లోపాలను సరిదిద్దు కోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు వివిధ సమస్యలపై నిత్యం పంచాయితీ కార్యాలయానికి వస్తూ ఉంటారని వారికి పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. అధి కారులు ప్రజలకు జవాబు దారీగా ఉండాల న్నారు. అదేవి ధంగా గ్రామంలోని కమ్యూనిటీ హాలును పరిశీలించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అందు బాటులో ఉంచాల న్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో కలియ తిరుగుతూ పారిశుద్ధ్య నిర్వహణను గమనిస్తూ పలుచోట్ల ప్రజలతో మాట్లా డుతూ, సమస్యలపై ఆరాతీశారు. తహసిల్దార్ వెంట పంచాయతీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శిరోరక్ష ప్రాణరక్షపై ప్రజలకు అవగాహన

రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:బాపట్ల జిల్లా పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిరోరక్ష ప్రాణరక్ష కార్య క్రమంపై ప్రజలకు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మంగళవారం రేపల్లె పాతబస్టాండ్ అంకమ్మ చెట్టు సెంటరులో రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని పారా లీగల్ వాలంటీర్లు ఆర్.శ్రీనివాసరావు,సయ్యద్ తాహిర్ అహ్మద్‌లు తెలియజేశారు.కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడిపేటప్పుడు పోలీసులు నిర్దేశించిన నిబంధనలను పాటించాలని వారు కోరారు.



# బాపట్ల జిల్లా వార్త



## రేపల్లె సబ్‌జైలు అధికారి సస్పెండ్

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** తెనాలి 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో రేపల్లె సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బి.అజిత్ కుమార్ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో అనారోగ్యం కారణంగా వైద్య చికిత్స పొందుతూ గత మార్చి నెలలో పరారైన సంఘటనలో సహకరించారనే నిర్ధారణకు వచ్చిన గుంటూరు జిల్లా అధికారులు రేపల్లె సబ్‌జైలు సూపరింటెండెంట్ మన్నెం వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.తమిళనాడు రాష్ట్రంలో నివసిస్తున్న అజిత్‌కుమార్ సోదరి రూ.60 వేలు నగదును జైలు అధికారి వెంకటేశ్వరరావుకు ఆన్‌లైన్ ద్వారా పంపిన ఆధారాన్ని సేకరించారు.అజిత్‌కుమార్‌పై నాలుగు రాష్ట్రాలలో కేసులు నమోదై ఉన్నాయి.అనారోగ్యం కారణం చూపుతూ అజిత్‌కుమార్‌ను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపడంలో రేపల్లె సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాత్ర ఉందని విచారణలో రుజువుకావడంతో గుంటూరు జిల్లా పోలీసులు ఈ విషయాన్ని జైళ్ళ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.ఈ నేపథ్యంలో జైళ్ళ శాఖ ఉన్నతాధికారులు పూర్వాపరాలను పరిశీలించి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు.

# విద్యార్థులకు భరోసా.!

**-బాపట్లలో ఘనంగా వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ - 951 మంది విద్యార్థులకు కిట్లు, స్కాలర్‌షిప్‌లు అందజేత**

**బాపట్ల,ఏప్రిల్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో రాణించగలరని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) డి. శ్రీనివాస్ అన్నారు. సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో వృత్తి విద్య అభ్యసిస్తున్న




విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానికంగా అత్యంత వేడుకగా జరిగింది.పదో తరగతితో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు దసరా, వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా 12 రోజుల పాటు (80 గంటలు) ఈ ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 951 మంది విద్యార్థులు ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో దసరా సెలవుల్లో 724 మంది, వేసవి సెలవుల్లో 227 మంది శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా సర్టిఫికెట్లు, టీషర్టులు, మరియు రూ. 1500 విలువైన టూల్‌కిట్లను పంపిణీ చేశారు. అంతేకాకుండా, ప్రతి విద్యార్థి ఖాతాలో రూ. 1000 స్కాలర్‌షిప్ జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధి దిశగా అడుగులుఈ సందర్భంగా డీఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 7,492 మంది విద్యార్థులు సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం పుస్తక జ్ఞానం సరిపోదని, చేతివృత్తుల్లో నైపుణ్యం ఉంటేనే ఆర్థిక స్వాలంబన లభిస్తుందని పేర్కొన్నారు.గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం. చారులత మాట్లాడుతూ.. జిల్లాలో నైపుణ్యవంతులైన విద్యార్థులు తయారవుతుండటం గర్వకారణమన్నారు. డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ సాదిక్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో సాంకేతిక నైపుణ్యం కలిగిన యువతకు విపరీతమైన డిమాండ్ ఉంటుందని ఉద్ఘాటించారు.తమ పిల్లలకు చదువుతో పాటు పని నేర్పించి, ఉచితంగా టూల్‌కిట్లు, స్కాలర్‌షిప్‌లు అందించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం తమ పిల్లల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని వారు కొనియాడారు. తమకు ఈ అద్భుతమైన అవకాశం కల్పించిన సమగ్ర శిక్షా విభాగానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యలతో రేపల్లెలోని గ్యాస్ వినియోగదారులు సతమతం

రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:పట్టణంలోని ఇన్ సో గ్యాస్ ఎస్ జనరల్ ట్రేడర్స్ నిర్వాకంపై బాపట్ల జిల్లా కలెక్టర్,రేపల్లె ఆర్డీవో,బాపట్ల డిఎస్‌వో,కొండపల్లిలోని హెచ్‌పి గ్యాస్ కంపెనీ ప్రాంతీయ అధికారికి వినియోగదారులు ఫిర్యాదులు పంపారు.డెలివరీ బాయ్స్ చేతివాటం,గ్యాస్ ఏజన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యధోరణి గురించి ప్రస్తావించారు.గ్యాస్ సిలెండరు డోర్ డెలివరీ చేయకుండా వాహనాన్ని ఒక చోట నిలుపుదల చేసి వినియోగదారులే తీసుకువెళ్ళాలంటూ డెలివరీబాయ్స్ వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదులు వెళ్ళాయి.ఇసుకపల్లిలో నివసిస్తున్న ఎస్‌కెఎండి గౌస్‌లూరా అనే దివ్యాంగుడికి గ్యాస్ ఏజన్సీ నిర్వాహకుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. తల్లి షేక్ బీబీ జాన్ పేరుతో ఉన్న 732102 వినియోగదారుని ఖాతా నుండి ఏప్రిల్ 3వ తేదీ ఫోన్ పే ద్వారా రూ.952 నగదు చెల్లించి గ్యాస్ బుక్ చేసుకున్నారు.రోజులు గడుస్తున్నా గ్యాస్ పంపిణీ జరగని కారణంగా బాపట్ల జిల్లా డిఎస్‌ఒ ఆర్.జమీర్ బాషాకు ఏప్రిల్ 13వ తేదీ ఫిర్యాదు చేయగా గ్యాస్ ఏజన్సీతో మాట్లాడి గ్యాస్ సిలెండరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.అయినప్పటికీ సమస్యకు పరిష్కార మార్గం లభించనందున సోమవారం రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీ అందజేశారు.ఇసుకపల్లి ప్రాంతానికి చెందిన 702134 కన్స్యూమర్ ఏప్రిల్ 6వ తేదీ గ్యాస్ బుక్ చేసుకుంటే 18వ తేదీ సిలెండరు పంపిణీ చేశారు.754758 కన్స్యూమర్ ఏప్రిల్ 1వ తేదీ గ్యాస్ బుక్ చేసుకుంటే 13వ తేదీ పంపిణీ చేశారు.710953 కన్స్యూమర్ ఏప్రిల్ 13వ తేదీ గ్యాస్ బుక్ చేసుకుంటే 19వ తేదీ పంపిణీ చేశారు.బీబీ జాన్ ముందుగానే నగదు చెల్లించినా గ్యాస్ పంపిణీ మాత్రం జరగలేదు.పిఎంఏవై ఎన్టీఆర్ నగర్‌లో గ్యాస్ వినియోగదారుల నుండి రశీదులో రూ.952 నమోదు చేసి ఉన్నప్పటికీ గ్యాస్ డెలివరీ బాయ్ రూ.1000 వసూలు చేస్తున్నట్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.అదనంగా వసూలు చేయడంపై వినియోగదారులు నిలదీస్తే డెలివరీ ఛార్జీలు వసూలు చేస్తున్నామని డెలివరీ బాయ్ పేర్కొనడం,బిల్లు చూపించకపోవడం వంటి సమస్యలను కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు.ఇంటి వద్దకు వెళ్ళి గ్యాస్ సిలెండరు ఇవ్వకుండా బరియల్ గ్రౌండ్ వద్ద గ్యాస్ సిలెండర్ల వాహనాన్ని నిలిపి అక్కడకు వచ్చి సిలెండరు తీసుకువెళ్ళాలని డెలివరీ బాయ్ చెప్పడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.ఈ ప్రాంతానికే ఇటువంటి సమస్యలు పరిమితం కాలేదు.రేపల్లె పట్టణంలోని గ్యాస్ వినియోగదారుల నుంచి సమస్యలు వెల్లువెత్తుతున్నాయి.గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు, సిబ్బంది అనుసరిస్తున్న విధానాలపై సంబంధిత అధికారులు సమగ్రమైన విచారణ చేపట్టాలని పట్టణంలోని గ్యాస్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బడి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.!

**కర్లపాలెం, ఏప్రిల్ 21:,ప్రభాతవార్త:** బడి పిలుస్తోంది రా.. నీ బంగారు భవిష్యత్తు కోసం అడుగులు వేయిఅంటూ కర్లపాలెం మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు ఇంటింటికీ చేరువవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాసరావు తెలిపారు.మంగళవారం కర్లపాలెంలో బడి పిలుస్తోందికార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ బృందం ముమ్మరంగా ప్రచారం నిర్వహించింది. స్థానిక ఐసిడిఎస్ (అంగన్‌వాడీ) పాఠశాలను సందర్శించి, అక్కడ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల వివరాలను సేకరించారు. అనంతరం గ్రామాల్లోని గృహాలను సందర్శించి, ఐదేళ్ల వయసున్న పిల్లలందరినీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే ప్రక్రియను ఉత్సాహంగా ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని, గ్రామంలో ఒక్కరు కూడా బడి బయట ఉండకూడదన్నదే తమ లక్ష్యమని ఉపాధ్యాయులు ఇనకొల్లు పోలీస్ రావు స్పష్టం చేశారు. బడి వీడిన పిల్లలను గుర్తించి, వారిని తిరిగి బడిలో చేర్పించి అక్షర వెలుగులు నింపాలని ఆయన కోరారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న వసతులు, నాణ్యమైన బోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక



ఉపాధ్యాయులు కె. విమలమ్మ, ప్రసన్న లక్ష్మి, ఐసిడిఎస్ కార్యకర్తలు నాగలక్ష్మి, పద్మ, దేవకృప తదితరులు పాల్గొన్నారు.

# పిఎండిఎస్ విత్తనాలతో రైతులకు ప్రయోజనం

## ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:మండలంలోని కారుమూరులో రైతుల కోసం మంగళవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఫ్రీమాన్ డ్రై సోయింగ్‌లో భాగంగా 20 రకాల విత్తనాలను కలిపి కిట్స్ రెడీ చేశారు.ఈ సందర్భంగా రేపల్లె మండలం ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ నవ ధాన్యాల సాగుతో ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.ముందుగా భూమి కర్బన శాతం పెరుగుతుందన్నారు.నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.పశుగ్రాసంలా ఉపయోగపడుతుందన్నారు.ప్రధాన పంటలో కలుపు నివారణ సాధ్యపడుతుంది.నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.నేల కోతను అరికట్టవచ్చు.ప్రధాన పంటలో దిగుబడి పెరుగుతుంది.365 రోజులు భూమిని కప్పి ఉంచడం వలన మే,జూన్ నెలల్లో భూమి వేడికి గురికావడం తగ్గుతుందని ఆయన వివరించారు.రైతులకు ఫ్రీమాన్ డ్రై సోయింగ్ గురించి ఎఫ్ఎంటి శివ నాగేశ్వరమ్మ కూలంకుషంగా రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వివిఎలు,ఐసిఆర్‌పిలు,బయో రిసోర్స్ ఇన్పుట్ సెంటర్ యజమాని చిలకా సామ్రాజ్యం,వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**చింతమోటులో..**

భట్టి ప్రోలు మండలంలోని చింతమోటు గ్రామంలో బిఆర్‌సి దుకాణంలో పిఎండిఎస్ విత్తనాలను సిద్ధం చేసినట్లు ఎన్ఎఫ్ఏ శ్రీనివాసరావు చెప్పారు.25 రకాల విత్తనాలను కలిపి పిఎండిఎస్ విత్తనాలుగా సిద్ధం చేయడం




జరిగిందన్నారు.ఎల్‌నినో ప్రభావం వలన వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.నేల సారవంతం కోసం రైతులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ముందుగా పిఎండిఎస్ పద్ధతిని రైతులు పాటించాలని ఆయన సూచించారు.పిఎండిఎస్ విత్తనాలను పొలంలో చల్లితే నేల ఆరోగ్యవంతంగా తయారై సేంద్రీయ శక్తి పెరుగుతుందన్నారు.మండల కో ఆర్డినేటర్ ఝాన్సీ మాట్లాడుతూ నేలలో సేంద్రీయ పదార్థం,నేలలో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు.ఈ విధానాన్ని రైతులు విధిగా పాటించాలని ఆమె కోరారు.బిఆర్‌సి నిర్వాహకురాలు చందోలు సుశీల మాట్లాడుతూ ఎకరాకు 14 కిలోల పిఎండిఎస్ విత్తనాలను చల్లుకోవాలన్నారు.42 పిఎండిఎస్ కిట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.14 కిలోల విత్తనాల ధర రూ.1100గా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో గోగినేని సురేష్,సుధారాణి,రాధిక, పి.సాంబశివరావు, ప్రసన్న,రేవతి, ప్రసన్నకుమార్,రైతులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వాడకం పై ఉద్యమంలో కర్లపాలెం ఎస్సై రవీంద్ర

**కర్లపాలెం. ఏప్రిల్ 21. ప్రభాతవార్త:** వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పి సీఐ సూచనలతో కర్లపాలెం



మండలంలో విస్తృతంగా హెల్మెట్ వాడకంపై వాహన దారులకు అవగాహన కల్పిస్తున్నారు అంతేకాకుండా స్వయంగా ఆయనే ప్రతి వాహనదారుడు దగ్గరికి వెళ్లి హెల్మెట్ వల్ల కలిగే లాభాలను వారికి వివరిస్తున్నారు దాంతో వాహనదారులు అధిక సంఖ్యలో హెల్మెట్లు కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టమవుతుంది ఈ సందర్భంగా మంగళవారం ద్విచక్ర వాహనదారులకు ఆయన హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

## నేడు చేనేత కార్మికుల నిరాహార దీక్షలు ప్రారంభం

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు,కార్మికులు,వస్త్ర ఉత్పత్తి విక్రయదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుండి 24వ తేదీ ఉదయం 10 గంటల వరకు 48 గంటల పాటు మంగళగిరి నేతన్న సర్కిల్ సెంటర్‌లో నిరాహార దీక్షలు నిర్వహిస్తామని చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు గొట్టు ముక్కల బాలాజీ,మురుగుడు సత్యనారాయణలు మంగళవారం తెలిపారు.ఫిబ్రవరి 22వ తేదీ 16 చేనేత సంఘాల నేతృత్వంలో మహా గర్జన కార్యక్రమం నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం



విచారకరమన్నారు.చేనేత జౌళి శాఖ మంత్రిని కలిసి సిఎంతో భేటీ కార్యక్రమం ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయిందని బాలాజీ,సత్యనారాయణలు పేర్కొన్నారు.భవిష్యత్‌లో పోరాటాలను ఉధృతం చేసే పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు.నిరాహార దీక్షల కార్యక్రమానికి అధిక సంఖ్యలో చేనేత పరిశ్రమపై ఆధారపడిన వారంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.భట్టి ప్రోలు ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో చేనేత నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు,బట్టు నాగమల్లేశ్వరరావు ,కె.వీరమోహనరావు,వంగర శ్రీనివాసరావు,ఎఐటియుసి నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట పైర్లు భూసారానికి ఏకైక మార్గం

**నగరం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** పచ్చిరొట్ట పైర్లు భూసారానికి ఏకైక మార్గం అని నగరం మండల వ్యవసాయ అధికారి వి .రమేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిధిలోని నగరం, అద్దంకివారిపాలెం



గ్రామంలో పచ్చి రొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట పైర్లలో జీలుగా ఎకరానికి 12 కిలోల విత్తనాలు వేస్తే 9 నుంచి10 టన్నుల పచ్చి రొట్టె ఎరువు తయారు అవుతుందని, నత్రజని 3.5శాతం, భాస్వరం 0.6 శాతం, పొటాష్ 1.2 శాతం వరకు లభ్యమవుతుందని, జనము ఎకరానికి 16 కిలోల వరకు విత్తనాలు వేస్తే మూడు నుంచి నాలుగు టన్నుల వరకు వచ్చే రొట్టె తయారవుతుందని ఇందులో నా ప్రజలని 2.3 శాతం, భాస్వరం 0.5, పొటాష్ 1.80 ఈ ఎకరానికి 16 కిలోల వరకు నత్రజని స్థిరీకరించబడతాయని తెలిపారు పిల్లి పెసర ఈ ఎకరానికి 8 కిలోల వరకు విత్తనాలు వేస్తే ఐదు నుంచి ఆరు టన్నుల వరకు పచ్చి రొట్టె అందిస్తుందని ఇందులో నత్రజని 2.10, భాస్వరం 0.5, ఫాటోస్ 1.10 పోషకాలతో లభ్యమవుతాయని తెలిపారు .ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని తెలియజేశారు. పి ఎం డి ఎస్ క్రింద 20 రకాల విత్తనాలు జీలుగా ,పిల్లి పెసర ,సెనగ, ఆవాలు ఇంకా కొన్ని రకాలు కలిపి పచ్చి రొట్ట పైరుగా వాడుకోవచ్చని కేజీ 100 రూపాయలకి అమ్మకానికి తయారుచేసి రెడీగా ఉన్నాయని, ఎకరానికి 15 కేజీలు చొప్పున చల్లుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం అఫ్ ఇంచార్జి గట్టుపల్లి మారయ్య, ఏఈవోలు కే. నాగ శ్రీనివాసరావు, వంశీకృష్ణ ,బిఏలు లోహిత ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడం ద్వారా మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చు

**చెరుకుపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రైతులు పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా భూసారం పెంపు, సముతుల్యంగా ఎరువులు వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడిఏ లక్ష్మి అన్నారు. మంగళవారం రాంభట్ల వారి పాలెం గ్రామంలో రైతులకు అవగాహన



కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎండి ఫరూక్ అధ్యక్షత వహించారు. పచ్చిరొట్ట ప్రాముఖ్యత, ఎరువులు వినియోగం, భూసార పరీక్షలు ఆవశ్యకత తదితర విషయాల గురించి రైతులకు వ్యవసాయ అధికారి ఎండి ఫరూక్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏపీ సీ ఎన్ ఎఫ్ ద్వారా అందిస్తున్న పీఎండీఎస్ విత్తనాల ప్రాముఖ్యత, సహజ వ్యవసాయ విధానాలు తద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఫార్మర్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం రైతులు పొందే ఆవశ్యకతను మరియు విత్తనాల ఎంపిక కొనుగోలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఉద్యాన సహాయకురాలు సరిత రైతులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ,అభ్యుదయ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, పలువురు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట ఎరువులు

**నిజాంపట్నం, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల భూసారం పెరుగుతుందని ఎఓ చుక్కా విజయరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ప్రజ్ఞంలో పచ్చిరొట్ట ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పంటలు పండిస్తుంటే భూసారం తగ్గుతుందన్నారు. భూసారం పెరుగుదలకు జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లను



వేయాలని సూచించారు. 40-45 రోజుల దశలో ఉన్న జనుము, జీలుగ మొక్కలను భూమిలో కలియదున్నితే 5 టన్నుల పచ్చిరొట్ట ఎరువు తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యేమినేడి శివకుమారి, ఐసిఆర్‌పిలు , బిఆర్‌సి ఓనర్ సుబ్బారావు, వివిఎ లీలానాగసాయి, పుప్పాల నాగేశ్వరరావు, విఆర్ఓ శామ్యూల్ రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

నిజాంపట్నం, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఎంఇఓ 2 శేషుగోపాలం అన్నారు. మంగళవారం మండలంలోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలోని ఎంపిపిఎస్‌లో జరిగిన పాఠశాల సంవత్సరాంతపు తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలకు పంపాలని కోరారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు , మెడల్స్, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, మెమెంటోలు, పంపిణీ



చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు జడ్‌పి హెచ్‌ఎస్ హెచ్‌ఎం పద్మారావు, హెచ్‌ఎం చుక్కా బాపయ్య, ఉపాధ్యాయులు ఆరిఫున్నీసా, ఎస్ఎంసి ఛైర్మన్ జి రజిని, సిఆర్‌పి జె సులోచన, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారికి సత్కారం

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** గ్రామ స్వర్ణ వార్డు స్వర్ణ కార్యక్రమానికి బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన భట్టి ప్రోలు మండల జిఎస్ డబ్ల్యూ అధికారి,పెదపులివర్రు గ్రామ సచివాలయం ప్రత్యేక అధికారి పి.మల్లికార్జునరావును మంగళవారం ఎంపిడివో కార్యాలయంలో ఘనంగా



సత్కరించారు.మల్లికార్జునరావు ఉత్తమ సేవలకు నిదర్శనంగా జిల్లా స్థాయి బాధ్యత లభించిందని ఎంపిపి డి.వి.లలిత మల్లేశ్వరరావు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఎస్.వెంకటరమణ,ఎ.డి జలజ,ఈవోపిఆర్డీ విజయబాబు,పంచాయతీరాజ్ ఎఇ రామసేతు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండలంలోని వెల్లటూరులో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులను చేర్పించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ




నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్యాబోధన,ఉచిత పాఠ్య పుస్తకాలు,మధ్యాహ్న భోజనం,దుస్తులు,డిజిటల్ లెర్నింగ్ వంటి సదుపాయాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి,మండల 2వ విద్యాశాఖ అధికారి ఎస్.దేవరాజ్,యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వి.సురేష్‌కుమార్, జి.మురళీమోహన్,వై.శ్రీనివాసరావు,శైలజ,ఆశాలత,బేబి,విజయలక్ష్మి,పోతురాజు,వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి గుడిలో జనసేన పార్టీ నాయకుల పూజలు

**చెరుకుపల్లి ,ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మత్తి భాస్కరరావు ఆరేపల్లి గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మత్తి అనురాధ ఆధ్వర్యంలో విశేష ఆకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తి భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని



రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అందుకు పవన్ కళ్యాణ్ గారి కృషి ఎంతో ప్రధానమైనదని అన్నారు.పూజా కార్యక్రమంలో బాలాజీ యానాదిరావు, పి రామారావు, సుబ్రహ్మణ్యం, తాత పోలేరయ్య ,గూడపాటి శ్రీనివాసరావు, వీర మహిళలు, జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుబ్బారావుకు తెలుగు సంస్కృతి సాహితీ జాతీయ పురస్కారం

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణానికి చెందిన ఆర్టిస్ట్,కళా తపస్వి పోలూరు సుబ్బారావుకు తెలుగు సంస్కృతి సాహితీ జాతీయ పురస్కారం లభించింది.తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్,తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో పోలూరు సుబ్బారావుకు జాతీయ పురస్కార సన్మాన పత్రాన్ని అందజేశారు.హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గౌరీశంకర్ ఘనంగా సుబ్బారావును సత్కరించారు.

# 28న ఏఎన్‌యులో మ్యూజికల్ నైట్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్21, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో ఈనెల 29న ఏఎన్‌యు కళాశాలల వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని 28న మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు తెలిపారు. వార్షికోత్సవ వేడుకల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు పోస్టర్‌ను ఆవిష్కరించి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. అనంతరం వేడుకల కన్వీనర్ ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ 28న సాయంత్రం మ్యూజికల్ నైట్, 29న మధ్యాహ్నం నుంచి ఆర్ట్స్, సైన్స్, ఫార్మశీ, వ్యాయామ విద్య కళాశాలల వార్షికోత్సవం జరుగుతుందన్నారు. వేడుకలకు వీసి గంగాధరరావు ముఖ్యఅతిథిగా, ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత మంగళ్‌సింగ్, అంతర్జాతీయ జానపద కళారత్న దామోదర గణపతిరావులు హాజరౌతారని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య పాల్‌కుమార్, ఆచార్య తేజోమూర్తి, నూటా అధ్యక్షుడు ఆచార్య బ్రహ్మాజీరావు, ఆచార్య తులసీదాసు, ఆచార్య జ్యోతిర్మయి, డాక్టర్ పి.రవి, డా.ఎం.వి.రమణ, డా. ఎస్.బాబు, డా.కె.శశిధర్, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఏపీ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో ఆదిశంకరాచార్యులు రామానుజాచార్యుల జయంతి వేడుకలు

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** గుంటూరు కొత్తపేటలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయం నందు జగద్గురు ఆది శంకరాచార్యులు వారు మరియు రామానుజాచార్యుల వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ ఆది శంకరాచార్యులు వారు ఎనిమిదవ శతాబ్దంలో కేరళలోని కాలడి లో జన్మించారు అద్వైత వేదాంతవేత్త 32 ఏళ్ల జీవితకాలంలో భారతదేశం అంతా పర్యటించి సనాతన ధర్మాన్ని నిలబెట్టారు అంతే కాకుండా భగవద్గీతకు భాష్యం చెప్పిన జగద్గురువులు ఆదిశంకరాచార్యులని తెలిపారు. అలాగే శ్రీ రామానుజాచార్యులు సమానత్వం, భక్తి మార్గాన్ని ప్రజల్లో వ్యాప్తి చేసి భారతీయ సంస్కృతికి చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సత్సంకల్పాలు పెంపొందించి, సంస్కృతి పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. మహావిష్ణువు అవతారమైన పరశురాముడు ధర్మ పరిరక్షణ కోసం చేసిన త్యాగాలు, సమాజానికి ఇచ్చిన విలువలు స్మరించుకోవాల్సినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ పవన్ కుమార్ ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర, రేపూడి చలపతిరావు, ప్రముఖ వాస్తు సిద్ధాంతి పవన్ శర్మ, ఉదయ్, రామరాజు రవికుమార్, బ్రాహ్మణ బంధువులు ఖాతాదారులు పాల్గొన్నారు

# అంతరాష్ట్ర నేరస్తుల అరెస్టు

## 32 లక్షల విలువైన 216 గ్రాముల బంగారు వస్తువుల స్వాధీనం

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు క్రైం డిసిపి కె.తిరుమలేశ్వరరెడ్డి సూచనలతో క్రైం ఎడిసిపి ఎం.రాజారావు అధ్వర్యంలో ఏసిపి సిహెచ్ వెంకటేశ్వర్లు,సిసిఎస్ సిఐ



ఎం.కిషోర్‌బాబు,వారి సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఎన్టీఆర్ జిల్లాలో రాత్రి పూట జరుగుతున్న చోరీలను నివారించడంలో ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో చోరీ జరిగిన కేసుల్లోని సంఘటనా స్థలాలను పరిశీలించి సాంకేతిక ఆధారాలను సేకరించి,అనుమానతిఉల కదలికలపై పూర్తి నిఘాను ఏర్పాటు చేశారు. మంగళవారం సిసిఎస్ సిఐ ఎం.కిషోర్‌బాబు,వారి సిబ్బందికి రాబడిన సమాచారం మేరకు ఒన్‌టౌన్ సిటీ బస్ టెర్మినల్ సమీపంలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి,వారి నుండి సుమారు 32 లక్షల విలువైన 216 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారని క్రైం ఎడిసిపి ఎం.రాజారావు తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి గ్రామానికి చెందిన ఇట్టా గోపీనాథ్ అలియాస్ గోపి,దుంప రాంబాబు,మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్, గంపలగూడెం పోలీస్‌స్టేషన్,ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లతో పాటు పక్క రాష్ట్రమైన తెలంగాణలోని చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీలు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ కేసులలో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం,కొండపల్లి గ్రామానికి చెందిన ఇట్టా గోపీనాథ్ 10వ తరగతి వరకు చదివి ఆ తర్వాత చదువు మానేజి ఆటో నడుపుకుంటూ అది కూడా ఆపేసి,హైదరాబాద్‌లో బ్రిడ్జి కన్‌స్ట్రక్షన్ వర్క్స్‌లో ఆఫీసు బాయ్‌గా పనిచేసేవాడు. ఇతనికి దుంప రాంబాబు,దుంప సంత్,చీమశెట్టి గోపీ కృష్ణలు స్నేహితులు.వీరందరూ మందు సేవించడం,పొగ త్రాగడం,పేకాట ఆడటం,కోడి పందేలు వేయడం వంటి చెడు వ్యసనాలకు బానిసలై వారికి వచ్చే డబ్బులు సరిపోక చోరీలు చేయడం మొదలుపెట్టారు. అలా వారు తాళం వేసి ఇళ్ళల్లో పగలు,రాత్రి సమయాల్లో,తాళం వేసిన షాపులలో కూడా చోరీలు చేసే మార్గాన్ని ఎంచుకొని చుట్టు పక్కల ప్రాంతాల్లో రెక్కి నిర్వహిస్తూ ఆదను చూసుకొని ఇళ్ళల్లో,షాపులలో బంగారపు ఆభరణాలను,డబ్బులను చోరీ చేసేవారు.గతంలో ఇట్టా గోపీనాథ్,దుంప రాబాబులు పలు చోరీ కేసుల్లో జైలుకి వెళ్ళి వచ్చారు. ఈ సందర్భంగా చెడు వ్యసనాలకు బానిసై చోరీ కోసం చెడు మార్గాన్ని ఎంచుకొని అనేక చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న అంతర్ రాష్ట్ర నేరస్థులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన క్రైం డిసిపి కె.తిరుమలేశ్వరరెడ్డి,క్రైం ఎడిసిపి రాజారావు,ఏసిపి సిహెచ్ వెంకటేశ్వర్లు,సిసిఎస్ సిఐలు కిషోర్‌బాబు,అసిస్టెంట్లు టి.బాలయ్య,బివి స్వామి,సిహెచ్ సత్యన్నారాయణ,పిసిలు సురేష్,వాలాద్రి,ఎస్‌కె మస్తాన్‌వలి,సిహెచ్ మిథున్‌లను సిపి రాజశేఖరబాబు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# అగ్ని ప్రమాదాలపై హోటల్ సిబ్బందికి అవగాహన

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు హోటల్ సిబ్బంది ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే అంశంపై కార్పొరేషన్ అధికారులు మంగళవారం మాక్



డ్రిల్‌ను నిర్వహించారు. నగరపాలక సంస్థ ఫైర్ విభాగం అధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ వీక్ సందర్భంగా అత్యవసర సమయంలో ప్రాణ రక్షణపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం లబ్బీపేట లోని జిఆర్టి హోటల్‌లో సిబ్బందికి మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో హోటల్‌లో ఉన్న సిబ్బంది,అతిథులు,సురక్షితంగా బయటకు ఎలా వెళ్ళాలి,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను ఎలా రక్షించాలి వంటి అంశాలపై వివరించారు. హోటల్ ఆవరణలో ఉన్న అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి,వాటి ఉపయోగం,వాడే సమయం,జాగ్రత్తలు వంటి విషయాలను స్పష్టంగా వివరించారు.అగ్నిప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో తెలియచేశారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తత,సమయస్ఫూర్తి ప్రాణాలను కాపాడగలవని అధికారులు వివరించారు. కార్యక్రమంలో డిఎఫ్ఓ మాల్యాద్రి,శంకరరావు,ఎస్ఎఫ్ఒలు నరేష్,రామారావు,హోటల్ జనరల్ మేనేజర్ హరిప్రసాద్,సేఫ్టీ ఆఫీసర్ సురేష్‌రెడ్డి తదితరులు,సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

**ఎ కొండూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం ఎ కొండూరు గ్రామ పంచాయతీ శివారు పాతకొండూరు బిసి కాలనీ ప్రజలకు ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా నివారణకు యుద్ధప్రాతిపదికన ఎంపిడివో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు చేతి పంపుల రిపేర్లు, రక్షిత మంచినీటి సరఫరా పథకానికి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు బిసి కాలనీలో డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ 350 అడుగుల మేర పాడైన పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ 6 కొత్త కుళాయిల ఏర్పాటు తాగునీటి ట్యాపుల కనెక్షన్స్ ఏర్పాటు ద్వారా ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి కంభంపాటి సుధాకర్ తెలిపారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపిడివో బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి జిపిఎస్ కె.సుధాకర్ యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ఎండాకాలంలో తాగునీటి కష్టాలు





ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నందుకు పాత కొండూరు, బిసి కాలనీ వాసులు ప్రజలు అబినందించారు.

# గ్రామాలలో యువత గ్రీన్‌ఫీల్డ్ సోల్జర్స్‌గా మారాలి

**పెనమలూరు ఏప్రిల్21,ప్రభాతవార్త :** కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం పెనమలూరు మండలం గంగూరు గ్రామంలో మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా గంగూరులో వ్యర్థాలను కొనుగోలు చేసి నిత్యావసర సరుకులు ఇచ్చే గ్రీన్‌షాపును నియోజకవర్గ శాశనసభ్యులు బోడేప్రసాద్,జాయింట్ కలెక్టర్ నవీన్,సీఈవో జెడ్పీ అరుణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిఒక్కరికి అవగాహన కల్పించుటకు నూతనమైన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలు నుంచచి ప్లాస్టిక్,ఖాళీసీసాలు,ఇళ్ళలో ఉపయోగించని వస్తువులు తీసుకొని దానికి అనుగుణంగా నిత్యావసర సరుకులు అందించే షాపులను ఏర్పాటు చేయటం ద్వారా ప్రజలకు ఉపయోగంతోపాటు పర్యావరణాన్నికూడా రక్షించవచ్చనే ఉద్దేశ్యముతో ఇటువంటి నూతన కార్యక్రమాన్ని కూటమిప్రభుత్వం చేపట్టిందన్నారు.గ్రామాలలో యువత గ్రీన్‌ఫీల్డ్ సోల్జర్స్‌గా



మారి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు.జాయింట్ కలెక్టర్ నవీన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో ఉపయోగించే ఈ పద్ధతిని రాష్ట్రంలో అవలంబిస్తున్నట్లు తెలిపారు.గ్రీన్‌షాపుని రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా కృష్ణాజిల్లాలో ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్‌లు,తాగునీటి పనులకు సత్వర మరమత్తు చర్యలు

**ఎ కొండూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపిడివో బి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ లీడర్ మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు, డ్రైనేజీల్లో పూడికతీత పరిశుభ్రత గ్రామంలో తాగునీటి పంపులు కుళాయిల పైప్‌లైన్ లీకేజి పనులు ముమ్మరంగా నిర్వహించారు. ఈ వేసవిలో ప్రజలు తాగునీటి ఎద్దడికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాల మేరకు ఈ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎంపి కేశినేని చిన్నికి ఎంపిడివో బి.శ్రీనివాసరావుకు మాజీ సర్పంచ్ తిరుపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# వరగాని కళాపరిషత్ నాటక పోటీలు విజేతలకు బహుమతులు ప్రధానం,కళాకారులకు సత్కారం

**పెదనందిపాడు ఏప్రిల్ 21,(ప్రభాతవార్త) :** గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం వరగానిలో గత ఐదు రోజుల నుండి నిర్వహించిన లావు వెంకటేశ్వర్లు కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల పదవ ఆహ్వాన నాటక పోటీలు . సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. కళాపరిషత్





వారు మంగళవారం వేకువ జామున గెలుపొందిన నాటికలకు, కళాకారులకు బహుమతి ప్రధానం నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇది అతని సంతకం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి "అసత్యం", జూరీ ఉత్తమ ప్రదర్శనగా సాంస్కృతిక సమితి విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి, ఉత్తమ నటుడుగా అసత్యం నాటికలోని బసవయ్య పాత్రధారి పి రామారావు, ద్వితీయ ఉత్తమ నటుడుగా మమ్మల్ని బ్రతకనివ్వండి నాటకంలోని ఈ ఎస్ పవన్ కుమార్, ఉత్తమ నటిగా అమ్మ చెక్కిన బొమ్మ నాటకంలోని జ్యోతి రాజ్ బీశెట్టి, ద్వితీయ ఉత్తమనటిగా మమ్మల్ని బ్రతకనివ్వండి నాటకంలోని రాజేశ్వరి, ఉత్తమ క్యారెక్టర్ నటుడు ఇది అతని సంతకం నాటకంలోని ఎన్ రవీంద్ర రెడ్డి, ఉత్తమ సహాయ నటుడు మాతృత్వం నాటకంలోని పొగర్తి నాగేశ్వరరావు, ఉత్తమ సహాయ నటి ఇది అతని సంతకం నాటకంలోని కుసుమ సాయి, ఉత్తమ హాస్యనటుడు దీపం కింద చీకటి నాటకంలోని జి సురేంద్రబాబు, ఉత్తమ విలన్ గా కన్నీటికి విలువెంత నాటకంలోని జ్యోతి రాణి, ఉత్తమ రచన అమ్మ చెక్కిన బొమ్మ నాటక రచయిత జ్యోతి రాజ్ బీశెట్టి, ఉత్తమ దర్శకత్వం అసత్యం నాటకం దర్శకులు పి బాలాజీ నాయక్, క్యారెక్టర్ నటి అమృత వర్షిని, ఉత్తమ సంగీతం మమ్మల్ని బ్రతకనివ్వండి నాటకం కు గాను సాయి తేజ, ఉత్తమ ఆహార్యం కన్నీటికి విలువెంత నాటకంలోని కే నాగేశ్వరరావు, ఉత్తమ రంగాలంకరణ ఇది అతని సంతకం నాటకంలోని భీమ్, ఉత్తమ లైటింగ్ మమ్మల్ని బ్రతకనివ్వండి నాటకం కు గాను హరీష్, ఉత్తమ బాల నటుడు అమ్మ చెక్కిన బొమ్మ నాటకంలోని భాను ప్రకాష్, జ్యూరీ బహుమతులు కుమారి హర్షిని, సురభి ప్రియాంక, వేంపాటి రమేష్, భాగ్యరాజ్ లు ఎంపికయ్యారు. తొలుత టీవీ విశ్లేషకులు కందుల రమేష్ దంపతులకు మన ఊరి ప్రతిభావంతుల పురస్కార్ అవార్డు ఇచ్చి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య. శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ లు విజేతలకు బహుమతులు అందించారు. నాటక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ, నుసుము నాగభూషణం, చింతం దేవనాథరెడ్డి లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు ముద్దన రాఘవయ్య, అధ్యక్షులు పోపూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు, సభ్యులు బండారు రాంబాబు, కందిమల్ల సాంబశివరావు, ముత్తవరపు సురేష్ బాబు, దశరథ రామయ్య, పోపూరి స్రవంతి, జరుగుల రామారావు, రావి శివరామకృష్ణయ్య, పోపూరి రవి, చెన్నుపాటి సురేంద్ర, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# 2023లోనే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయండి

**తాడేపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** 2023 లోనే పార్లమెంట్ లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలు చేయాలని



కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ సలీం అన్నారు.మంగళవారంఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం షేక్ సలీం మాట్లాడుతూ 2023లోనే పార్లమెంటులో ఆమోదం పొంది, రాష్ట్రపతి సంతకం చేసి నోటిఫై అయిన 33 మహిళల రిజర్వేషన్ చట్టం అమలుచేయాలని అన్నారు.2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు అన్నీ మద్దతు ఇవ్వడం వలన పార్లమెంట్ అప్పుడే ఆమోదం పొందిందని అన్నారు.మహిళా రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలువ్యతిరేకం కాదని అన్నారు. అమరావతి రాజధాని బిల్లుపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికారక చైర్మన్ రేమిటిశెట్టి హనుమంతరావు, మంగళగిరి మండల అధ్యక్షులు కొప్పాకుల కృష్ణయ్య చౌదరి,బీసీ సెల్ అధ్యక్షులు ఆర్ల వెంకటస్వామి, తాడేపల్లి మండల అధ్యక్షులు షేక్‌పఠాన్ సుభాని, మైనార్టీ సెల్ నాయకులు షేక్ జల్సా,మంగళగిరి మహిళ అధ్యక్షురాలు కూర్మల రాధిక,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య,వసతులు

**మంగళగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ కాజా నందు విద్యార్థులు ఐదవ తరగతి పూర్తి చేసుకుని ఆరవ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం పద్మజారాణి అధ్యక్షతన గ్రాడ్యుయేషన్ డే జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఎన్ ఉషాకుమారి, జిల్లా పరిషత్ హై స్కూల్ చిన్న కాకాని హెచ్ఎం రామారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంగళగిరి మండల విద్యాశాఖ అధికారి ఎన్. ఉషా కుమారి విద్యార్థులను ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని హైస్కూల్లో ఎలా ఉండాలి? ఎలా చదువుకోవాలిఅని, అందరు క్రమశిక్షణతో ఉండాలని చెప్పి వారి ఆశీస్సులను అందజేశారు. జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం రామారావు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు నరసింహారావు, స్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయులు రజనీ, సతీష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వి.మురళీకృష్ణ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి వారి సందేశాన్ని, తల్లిదండ్రులకు గవర్నమెంట్



స్కూల్లో ఉండే సదుపాయాల గురించి తెలియజేశారు. ఐదో తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందచేశారు. విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ ప్రోగ్రాం లో స్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యా రంగంలో ప్రగతి సాధించాలి

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యారంగంలో విద్యార్థులు ప్రగతి సాధించాలని భట్టిప్రోలు కెఎస్‌కె డిగ్రీ కళాశాల అధ్యాపకుడు వి.బి.శివరామకృష్ణ అన్నారు.మంగళవారం రేపల్లె పట్టణంలోని అనగాని



భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బికాం విద్యార్థులకు అకౌంటింగ్ ప్రాధాన్యత,తరుగుదల అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల బోధనాంశాలను శ్రద్ధగా వింటూ సందేహాలను నివృత్తి చేసుకుంటూ విద్యాభివృద్ధి సాధించవచ్చని చెప్పారు.స్థిర ఆస్తుల వినియోగం,విలువల మార్పుకు సంబంధించి చోటుచేసుకుంటున్న పరిణామాలను వివరించారు.డిప్రిషియేషన్ వ్యాపారంలో ఖర్చులు,సరైన పంపిణీ,ధర నిర్ణయం,దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలో ఉపయోగాలను శివరామకృష్ణ తెలియజేశారు.వాణిజ్యశాఖ అధ్యాపకుడు ఎం.బుజ్జిబాబు మాట్లాడుతూ అమరావతిలో ఏర్పాటు చేసిన వ్యాపారాలకు 15 శాతం అదనపు తరుగుదల వెసులుబాటు కల్పించారన్నారు.అంటే వ్యాపారాలకు 35 శాతం తరుగుదల లభించే కారణంగా పన్ను భారం తగ్గుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు,బాలజ్యోతి,మురళి తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట పైర్లపై అవగాహన పెరగాలి

**రేపల్లె, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు పచ్చిరొట్ట పైర్లపై అవగాహన పెరగాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహేష్‌బాబు చెప్పారు. మంగళవారం మండ లంలోని గంగడిపాలెం, రాజుకాల్వ గ్రామాలలో రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



పచ్చిరొట్ట పైరులైన జీలుగ,జనుము,పిల్లి పెసర విత్తనాలు వేసుకోవడం వలన భూమిలో పోషకాలు పెరుగుతాయని చెప్పారు.రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని తెలిపారు.రసాయన ఎరువుల వలన భూ కాలుష్యం,వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు.సమర్థవంతమైన సమతుల్యత ఎరువుల వినియోగంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మహేష్‌బాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిఇవో సతీష్,గోపి రాజు పాల్గొన్నారు.

## సమాజ చైతన్య సంఘం సామాజిక సాంఘిక సేవలు ఎనలేనివి

**గుంటూరు విద్య, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సమాజ చైతన్య సంఘం 36వ వార్షికోత్సవ శుభసమయంలో ఆ సంఘం సమాజానికి 36 సంవత్సరాల పాటు అందించిన సామాజిక సాంఘిక సేవలు సమాజాభివృద్ధిలో ఎనలేనివని బిషప్ సెంట్రల్ గుంటూరు సీనెడ్ ఏ ఈ ఎల్ సి పారిస్ పాస్టర్ నార్త్ పారిస్ గుంటూరు రైట్ రెవరెండ్ డాక్టర్ ఎస్. జోహన్ బాబురావు అన్నారు. సమాజ చైతన్య సంఘం 36వ వార్షికోత్సవ వేడుకలు నల్లపాడు లోని ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగాయి. సండే స్కూల్ బాలబాలికలు మొదలుకొని స్త్రీల సమాజం వారు పెద్దలు వృద్ధులు యువతి యువకులు ఆప్తులు శ్రేయోభిలాషులు బంధువులు ప్రజాప్రతినిధులు సమాజ శ్రేయోభిలాషులు తదితరులు పెద్ద ఎత్తున వేడుకలకు హాజరయ్యారు. సమాజ చైతన్య సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గుంటూరు పరిశుద్ధ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకలకు ఎస్ జోహన్ బాబురావు ముఖ్యఅతిథిగా విచ్చేసి సమాజ చైతన్య సంఘం సభ్యులను, ఏఈఎల్‌సి సంఘస్తులను ఉద్దేశించి మాట్లాడారు. సంఘస్తులందరూ ఐక్యతతో ఉంటే దేవుని కృప తప్పకుండా వారిపై ఉంటుందని ప్రభువైన ఏసుక్రీస్తు నిండు దీవెనలు ఉంటాయని బాబురావు పేర్కొన్నారు. ఏ ఈ ఎల్ సి లోని అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏ ఈ ఎల్ సి సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. స్త్రీల సమాజం కు సామాజిక బాధ్యత ఎంతో ఉందని సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో పవిత్రమైనదనీ, అత్యుత్తమైనదని పేర్కొన్నారు. ప్రపంచం యుద్ధాలతో అశాంతిగా ఉందని ప్రపంచ శాంతి కొరకు ప్రతి సంఘస్తులు దేవునికి విన్నవించాలని కోరుతూ ఈ సందర్భంగా బాబురావు ప్రపంచ శాంతి కొరకు ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా స్త్రీల సమాజం చేస్తున్న విస్తృత పరిచర్యలకు బాబురావు చేతుల మీదుగా పలువురు మహిళలకు సన్మాన సత్కార కార్యక్రమాన్ని గావించారు. కార్యక్రమంలో భాగంగా వితంతువులకు మహిళలకు బిషప్ బాబురావు చేతుల మీదుగా సంఘ సభ్యులు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లపాడు ఏఈఎల్సి చర్చి పాస్టర్ రైట్ రెవరెండ్ చేబ్రోలు రవి, మాల మహానాడు నాయకులు ఎస్ వెంకటరమణ, సమాజ చైతన్య సంఘం జాయింట్ సెక్రెటరీ పుల్లగూర ఆనందబాబు, ఉపాధ్యక్షులు సూరి హరీష్, శానం రవి, గుంటూరు అబ్రహం ఉదయ్ ,దాసరి దేవరాజు ,సమాజ చైతన్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటూరు చైతన్య, విప్పర్ల అమరేశ్వర రావు, జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ పరుచూరి సంజీవ్, జి పవన్, గుంటూరు ప్రఖ్యాత్, కిరణ్ కుమార్, సమాజ చైతన్య సంఘం ఉపాధ్యక్షులు యనమాల కోటేశ్వరరావు, మే రుగా రత్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు పరిశుద్ధ రామును విషపు బాబురావులను సభ్యులు పెద్ద ఎత్తున సన్మాన సత్కారాన్ని గావించారు. కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ ప్రేమ విందును నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

# ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షునిగా కండే రాజేష్ నియామకం

**గుంటూరు విద్య ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా గుంటూరుకు చెందిన కండే నాగ రాజేష్ ను నియమిస్తూ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య ఉత్తర్వులు జారీ చేశారు. రాజేష్ ఈ పదవిలో రెండు సంవత్సరాలు పాటు కొనసాగనున్నారు. రాజేష్ తో పాటు, ప్రధాన కార్యదర్శిగా చిన్ని పవన్, కోశాధికారిగా దేవకి జనార్ధన్ నియమితులయ్యారు. మంగళ వారం గుంటూరు అశోక్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో కండె రాజేష్ కు ఇల్లూరు లక్ష్మయ్య నియామక పత్రం అందచేసారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కండే రాజేష్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు పాటుపడతానన్నారు. అనంతరం కండే రాజేష్ ను ఈవీవీ యువ కళా వాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘాల నాయకులు కండె కాంతారావు, మాశెట్టి సాత్విక్, చందోలు మణి కంఠ, కోట హనుమంతరావు, తూనుగుంట్ల శ్రీనివాస్ , కిషోర్, ధనుంజయ్, వికాస్, విజయ్, భరత్, మోర్య, విశ్వేశ్వర రావు, తదితరులు అభినందించారు. తన నియామకానికి సహకరించిన ఆర్య వైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు టీ.జీ.వెంకటేష్ తో పాటు పలువురు ఆర్యవైశ్య నాయకులకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.



# అభి పరుగుల ఉప్పెన

# షేక్

## ఐపిఎల్‌లో మరో సెంచరీ నమోదు

## ఉప్పల్‌లో శతక్కొట్టిన ఆరెంజ్ ఆర్మీ





68 బంతుల్లో 135 నాటౌట్

25 బంతుల్లో 50 రన్స్

47 బంతుల్లో 47 రన్స్

10 ఫోర్లు, 10 సిక్సులు

ఐపిఎల్‌లో రెండో సెంచరీ

ఉప్పల్‌లోనే 2 శతకాలు

*గుజరాత్ టైటాన్స్‌పై తిలక్ వర్మ శతక్కొడితే... 24 గంటల్లోనే ఆ వంతు అభిషేక్ తీసుకున్నాడు. ఢిల్లీని షేక్ చేశాడు. ఉప్పల్‌లో పరుగుల ఉప్పెన సృష్టించాడు. దీంతో ఐపిఎల్ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో పరుగుల వరద, సెంచరీల మోత మోగుతోంది. సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది. తొలి సెంచరీకి కాస్త ఆలస్యమైనా ఆ వెంటవెంటనే నాలుగు శతకాలు నమోద య్యాయి. జస్ట్ పది రోజుల వ్యవధిలోనే. అందులో 24 గంటల వ్యవధిలో రెండు సెంచరీలు. ఎపుడు ఎవరూ సెంచరీ సాధిస్తారో చెప్పలేని విధంగా ఐపీఎల్ మారింది. ఒకే మ్యాచ్‌లో ఇద్దరూ సెంచరీలు చేసే ఊపులో కనిపించారు. అలాగే పలువురు సెంచరీలకు దరిదాపుల్లోకి వచ్చారు. బ్యాటర్లు విరుచుకు పడుతుండడంతో 200 ప్లస్ స్కోర్లు సర్వసాధారణంగా మారాయి.*

**హైదరాబాద్, ఏప్రిల్ 21(వార్త క్రీడా ప్రతినిధి)**

క్రికెట్‌లో సెంచరీది ప్రత్యేకమైన స్థానం. శతక్కొట్టేవారికి ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. బ్యాట్ పట్టిన ప్రతి ఒక్కరూ కుదిరితే సెంచరీ చేయాలన్నదే కల. సెంచరీ సాధించడం సిక్స్‌లు కొట్టినంత తేలికకాదు. బ్యాట్ ఝుళిపిస్తే సెంచరీలు రాలవు. ఇది కేవలం పరుగుల వేట మాత్రమే కాదు, మానసిక స్థైర్యానికి సంబంధించిన పరీక్ష. శతకం సాధించాలంటే ఉండాల్సిన ముఖ్యమైన గుణం ఓపిక. క్రీజులో ఎక్కువ సమయం ఉండాలి. బంతికి బంతికి పరుగులు తీయాలనే తొందరపాటు కాకుండా, మంచి బంతులను గౌరవిస్తూ, చెడ్డ బంతులను బౌండరీలకు తరలించాలి. ఇక 90లలోకి వచ్చినపుడు పెరిగే ఒత్తిడిని అధిగ మించాలి. ఆ సమయంలో తొందరపడి వికెట్ పారేసుకోకుండా, ఓపిగ్గా ఆడి సెంచరీ పూర్తి చేసుకోవాలి. వికెట్ ఎలా ఉంది, బౌలర్లు ఎలా వేస్తున్నారు అని గమనించి, ఆటతీరును మార్చు కోవాలి. సమయం రావాలి, వచ్చేవరకు ఓపిగ్గా ఎదురు చూడాలి అనే కాన్సెప్ట్ వల్లనే సంజూ శాంమ్సన్, క్వింటాన్ డికాక్, తిలక్ వర్మ, ఇపుడు అభిషేక్ వర్మ సెంచరీ హీరోలు కాగలిగారు.

**అభిషేకింగ్:** అభి అంటే మొదటి బంతికే సిక్స్. కానీ ఈసారి డబుల్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. దూకుడుకు పోకుండా ఆచితూచి ఆడాడు. ఎదుర్కొన్న 7 బంతికే ఫోర్, 11వ బంతికి మరో ఫోర్ బాదాడు. ఎండిగి ఓవర్లో రెండు ఫోర్లు, నితిష్ రాణా ఓవర్లో రెండు సిక్స్‌లతో 25 బంతుల్లో హాఫ్ సెంచరీ కంప్లీట్ చేశాడు. అక్షర్, కుల్దీప్ బంతులను సిక్స్‌లుగా మలిచిన అభిషేక్... నితీష్‌రాణా ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లతో మరో 22 బంతులకు ఐపీఎల్‌లో రెండో సెంచరీ సాధించాడు. ఆ తర్వాత మరో ఫోర్, సిక్స్‌తో 23 రన్స్ పిండుకున్నాడు. కడదాకా క్రీజ్‌లో నిలిచి 135 రన్స్ చేశాడు.

**తొలి సెంచరీ హీరో సంజు :** టీట్వంటీ వరల్డ్‌కప్ హీరో సంజూ శాంసన్... ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి సెంచరీని తన పేరిట లిఖించాడు. సెంచరీకోసం సంజూ వెయిట్ చేస్తున్నట్లు కాక అతని కోసం శతకం ఎదురుచూసినట్లుగా మారింది. వరుసగా 3 మ్యాచ్‌ల్లో నిరాశపరిచిన సంజూ... ఢిల్లీ క్యాపిటల్స్‌పై చెపాక్‌లో 56 బంతుల్లో అజేయంగా 115 పరుగులు చేశాడు. చివరి వరకూ క్రీజ్‌లో నిలిచాడు. రెండు వందలకు పైగా స్ట్రయిక్ రేట్‌తో... 15 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో శతకం బాదాడు.

**వస్తూనే సెంచరీ మోత :** దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ క్వింటన్ డికాక్... ఈ ఐపీఎల్ సీజన్‌లోకి ముంబై ఇండియన్స్ తరపున గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చాడు. వస్తూనే సెంచరీతో మెరిశాడు. వాంఖడే స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లో అద్భుత సెంచరీ చేశాడు. 60 బంతుల్లోనే 112 పరుగులతో అజేయంగా నిలిచాడు. 8 ఫోర్లు, ఏడు సిక్స్‌లతో అలరించాడు.

**సెంచరీ తిలకం:** తిలక్ వర్మ... ముంబై ఇండియన్స్‌కు ఆడుతూ గుజరాత్‌పై అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో కేవలం 45 బంతుల్లో 101 పరుగులతో శతకొట్టాడు. ఐపీఎల్ కెరీర్‌లో తొలి సెంచరీ నమోదుచేశాడు. 22బంతుల్లో కేవలం 19 రన్స్ చేసిన తిలక్.. ఆ తర్వాత గేర్ మార్చి సునామీలా విరు చుకుపడ్డాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ. మరో 12 బంతులు ముగిసేసరికి సెంచరీ సాధించాడు.

ఇక పంజాబ్ కింగ్స్ ప్లేయర్లు ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నోలీ(87) కూడా ఒకే మ్యాచ్‌లో సెంచరీ చేసే ఊపులో కనిపించారు. లక్నో సూపర్ జెయింట్స్‌పై ప్రియాన్ష్ 37 బంతుల్లో 93 రన్స్, కూపర్ కొన్నోలీ 87 రన్స్‌తో మెరిశారు. వీరేకాక కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, సమీర్ రిజ్వీ 90లలోకి వచ్చి తృటిలో సెంచరీ చేజార్చుకున్నారు. ఇక మెరుపు హాఫ్ సెంచరీలకేతే లెక్కేలేదు.

## సొంతగడ్డపై రైజర్స్ హ్యాట్రిక్ విన్

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియంలో సన్ రైజింగ్ కొనసాగుతోంది. సొంతగడ్డపై బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపిన ఆరెంజ్ టీమ్.. ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘనవిజయం సాధించింది. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు అభిషేక్(135), ట్రావిస్ హెడ్ మరో సారి చక్కని శుభారంభం అందించారు. ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడుతూ 8.5 ఓవర్లలో 97 పరుగులు అందించారు. ట్రావిస్ అవుటైనా అభిషేక్ జోరు తగ్గలేదు. ఇషాన్ కిషన్(13 బంతుల్లో 25)తో కలిసి రెండో వికెట్‌కు 79 రన్స్.. హెన్రీ క్లాసెన్( 13 బంతుల్లో 37 నాటౌట్ అండగా మూడో వికెట్‌కు అజే యంగా 66 రన్స్ జోడించాడు. ఈ క్రమంలో నితీష్‌రాణా నాలుగో ఓవర్లో 20 రన్స్, కుల్‌దీప్ 12వ ఓవర్లో 22 రన్స్, నితీష్ రాణా 15వ ఓవర్లో 23 రన్స్.. ఇలా పరుగుల వరద పారింది. దీంతో సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 242 పరుగుల భారీ స్కోరు చేసింది.

243 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను మలింగ దెబ్బతీశాడు. ఓపెనర్ నిస్సాంక(8)ను మధుశంక అవుట్ చేసి బ్రేక్‌త్రూ అందిస్తే... ఆ తర్వాత మలింగ బెంబేలెత్తించాడు. అర్ధసెంచరీతో రాణించిన నితిష్‌రాణా(30 బంతుల్లో 57)తో పాటు డేవిడ్ మిల్లర్(0), ట్రిస్టన్ స్టబ్స్(27), అశుతోష్ రాణా(14) వికెట్లను పడగొట్టాడు. 4వికెట్ల హాట్ సాధించాడు. మరోవైపు కేఎల్ రాహుల్ (37)ను సకిబ్ హుస్సేన్ పెవలియన్ పంపాడు. చివర్లో సమీర్ రిజ్వీ(41), అక్షర్(2), ఎంగిడి(0)లను హర్షల్ దూబే అవుట్ చేశాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 రన్స్ చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 48 పరుగుల తేడాతో గెలుపొంది ఖాతాలో నాలుగో విజయాన్ని చేర్చింది.




# కమ్‌బ్యాక్ ఎవరిది?

**లక్నో:** వరుస పరాజయాలతో ఉన్న రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు.. నేడు తలపడనున్నాయి. రెండు జట్లు కూడా ఆరంభంలో అదరగొట్టాయి. రాజస్థాన్ రాయల్స్ నాలుగు విజయాల తర్వాత వరుసగా రెండు ఓటములు పొందింది. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో ఓడింది. దిగువనుంచి రెండో స్థానంలో కొనసాగుతోంది. హాట్రిక్ ఓటములకు సొంతగడ్డపై ఫుల్ స్టాప్ పెట్టాలని లక్నో చూస్తోంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ మునుపటి జోరును అందుకుని గెలుపు ట్రాక్‌లో పడాలని ఉవ్విళ్లూ రుతోంది. ప్లే ఆఫ్ రేసులో నిలవాలంటే ఇక్కడి నుంచి గెలుపు బాటలో పడడం ఇరు జట్లకు కీలకం.

రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్‌లో వైభవ్ కీలక ప్లేయర్. ఆరు మ్యాచ్‌ల్లో 246 పరుగులు సాధించి జోరు మీదున్నాడు. రెండు వందలకు పైగా స్ట్రయిక్ రేట్‌తో పరుగులు సాధిస్తున్నాడు. యశస్వీ జైస్వాల్‌తో కలిసి ఫ్లయింగ్ స్టార్ట్‌లు అందిస్తున్నాడు. వీరిద్దరూ విఫలమైతే జట్టు బ్యాటిగ్ పేకమేడలా తయారవుతోంది. వీరిద్దరి లక్నో ఎంత తొందరగా పెవలియన్‌ను చేర్చడంపైనే విజయావ కాశాలు ఉంటాయి. లేదంటే రాయల్స్‌కు భారీ స్కోరు ఖాయం. విఫలమవుతున్న ధృవ్ జురెల్, రియాన్ పరాగ్, హెట్మెర్, జడేజా బ్యాటింగ్‌లో రాణించాల్సి ఉంటుంది. రాజస్థాన్ బౌలింగ్ మాత్రం సూపర్‌గా ఉంది. అర్చర్ ఆరంభంలోనే వికెట్‌తో బ్రేక్ త్రూ అందిస్తున్నాడు. రవి బిష్ణోయ్, జడేజా రూపంలో రాజస్థాన్ రాయల్స్‌కు చక్కని స్పిన్ వేరియేషన్ ఉంది.

లక్నో ఫారెన్ పేయర్లు మిచెల్ మార్ష్, మార్క్రమ్ బ్యాట్‌తో పెద్దగా రాణించింది లేదు. రిషబ్ పంత్ కూడా పరుగుల ట్రాక్‌లో పడాల్సి ఉంటుంది. ఆయుష్ బదోనీ, ముకుల్ చౌదరీ మాత్రమే లక్నో బ్యాటింగ్‌కు అండగా నిలుస్తున్నారు. బౌలింగ్‌లో సీనియర్ పేసర్ షమీతో పాటు ప్రిన్స్ యాదవ్ చక్కని లైన్ అండ్ లెంగ్త్‌తో అద్భుత ప్రదర్శన ఇస్తున్నాడు. ఆరు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి బాట్స్‌మెన్‌ను చక్కగా కట్టడిచేస్తున్నాడు.

**హెడ్ టు హెడ్:** ఇరు జట్లు ఆరు మ్యాచ్‌ల్లో తలపడగా, రాజస్థాన్ రాయల్స్ ఆధిక్యంతో ఉంది. రాయల్స్ నాలుగు మ్యాచ్‌ల్లో, లక్నో రెండు మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఇరు జట్లు చివరగా గత ఏడాది ఏప్రిల్19న తలపడగా లక్నో విజయం సాధించింది.

**పిచ్ రిపోర్ట్:** వాజ్‌పేయి ఏకానా స్టేడియం పిచ్ మందకొడిగా ఉంటుంది. ఈ పిచ్‌పై బ్యాటింగ్ కాస్తాంత కష్టమే. క్రీజ్‌లో నిలదొక్కుకుంటే పరుగులు సాధించవచ్చు. స్పిన్నర్లు, ఫాస్ట్ బౌలర్లు రాణించే అవకాశం ఉంది. లక్ష్యాన్ని ఛేధించే జట్టుకు విజయావకాశాలు ఉంటాయి.

**లక్నో సూపర్ జెయింట్స్(అంచనా):** మిచెల్ మార్ష్, మార్క్రమ్, రిషబ్ పంత్(కెప్టెన్), మాథ్యూ బ్రెట్జ్కే, ఆయుష్ బదోని, ముకుల్ చౌదరీ, మహ్మద్ షమీ, అవేష్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, సిద్ధార్థ్, మోసిన్‌ఖాన్; ఇఫాక్ట్ ప్లేయర్: హిమ్మత్ సింగ్; **రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్, రియాన్ పరాగ్(కెప్టెన్), హిమ్రాన్ హెట్మెర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా అర్చర్, బర్గర్, బ్రిజేష్ శర్మ, రవి బిష్ణోయ్, సందీప్ శర్మ; ఇంఫాక్ట్ ప్లేయర్: వైభవ్ సూర్యవంశీ



# మూడోరోజూ లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అమెరికా ఇరాన్‌లమధ్య తుదివిడతచర్చలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు సడలిపోతాయన్న నమ్మకాలు పెరగడంతో ఇన్వె స్టర్లు స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్లకు ఉపక్రమిం చారు. దీనితో వరుసగా మూడోరోజు కూడా స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే ముగిసాయి. మంగళ వారం నిఫ్టీ 24,550 మార్కును దాటేసింది. ఎఫ్‌ంసిజి, ప్రైవేటు బ్యాంకింగ్ స్టాక్స్ భారీగా ర్యాలీ తీసాయి. నాలుగవ త్రైమాసిక ఫలితాల పైనా ఇన్వెస్టర్లు ఆసక్తిచూపించి అప్రమత్తంగా కొనుగోళ్లుజరిపారు. బిఎస్ఇ సెన్సెక్స్ 753.03 పాయింట్లుపెరిగి 79,273.33 పాయింట్లకు పెరిగితే, ఇఫ్టీ 50 సూచీ 211.75 పాయింట్లు పెరిగి 24,576.60 పాయింట్లకు చేరింది. వరు సగా మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ 1.65శాతం, 1.57శాతం చొప్పున పెరిగాయి.

హిందూస్తాన్ యూనిలీవర్ 3.13శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.41శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.04శాతం నిఫ్టీలో లాభాలకు మద్దతి చ్చాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.55శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.71శాతం చొప్పున లాభప డ్డాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 33 పైసలు క్షీణించి 93.49వద్ద కద లాడింది. ముందురోజు 93.16వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ లో జూన్ ఐదునాటి సెటిల్‌మెంట్లు రూ.1,53, 680వద్దకు చేరాయి. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు 0.12శాతంపెరిగి 4.252శాతంగా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు జూన్ సెటిల్‌మెంట్‌నాటికి 82 సెంట్లు పడిపోయి బ్యారెల్‌కు 94.66 డాలర్లుగా కొనసా గింది. ఈక్విటీ మార్కెట్లలో పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 0.25శాతం పెరిగింది. నెస్లే ఇండియా షేర్లు 7.09శాతంపెరిగాయి. బోర్డు త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా మారడంతో స్టాక్స్ పెరిగాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 5.95శాతం, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ 8.09శాతం, పెరిగాయి. రిస్ లైఫ్ సైన్సెస్ 3.81శాతం క్షీణించింది. రోలెక్స్ రింగ్స్ 16.43శాతం, ఈ2ఈ నెట్‌వర్క్స్ 5శాతం ఎగువన ట్రేడింగ్ ముగించాయి. ఏపెజీ సురేంద్ర పార్క్ హోటల్స్ 3.15శాతంపెరిగింది. అయోధ్య, ఉజ్జెయినిలలో కొత్తప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం కలిసొచ్చింది. నెల్కో5.92శాతంపెరిగాయి. కంపె నీ లాభాలు 1.09కోట్లు నమోదయ్యాయి. ఆవాస్ ఫైనాన్షియర్స్ 3.28శాతం పెరిగాయి. కంపెనీ బోర్డు యనుయశ్‌పాల్ సింగ్‌ను ఎండి సిఇఒగా నియమించేందుకు ఆమోదం తెలిపినట్లు ప్రకటిం చడంతో షేర్లు పెరిగాయి.

# ఎరువుల రంగంపై హార్ముజ్ ఎఫెక్ట్

## 24.6శాతానికి పడిపోయిన యూరియా ఉత్పత్తి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు భారతీయ ఉత్పత్తి రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. భారతఎరువుల రంగంపై యుద్ధ ప్రభావం మరీ అధికంగా ఉంది. కేంద్ర వాణిజ్యశాఖ రిలీజ్ చేసిన డేటా తీవ్ర ఆందోళనకరంగా ఉంది. దేశంలో ఎరువుల ఉత్పత్తి సుమారు క్వార్టర్ వంతు పడిపోయినట్లు అధికారి డేటా పేర్కొన్నది. ఇండి యాలో ఎరువుల ఉత్పత్తి మార్చిలో 24.6 శాతానికి పడిపోయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఎరువుల తయారీలో సహజవాయువు చాలా కీలకమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో నేచురల్ గ్యాస్ దిగుమతి క్షీణించింది. ఎరువుల ఉత్పత్తికి కీలకమైన సహజ వాయువు తగ్గడంతో గత ఏడాదితో పోలిస్తే మార్చి నెలలో ఎరువుల ఉత్పత్తి 24.6 శాతం తగ్గింది. నేచురల్ గ్యాస్ ద్వారానే ఎక్కువగా యూరియాను ఉత్పత్తి చేస్తారు. భారతీయ ఎరువుల రంగంలో యూరియా చాలా ప్రాధానమైంది.

భారత వ్యవసాయ రంగంలో యూరియాను వినియోగం ఎక్కువే. హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల ఆ మార్గం ద్వారా రావాల్సిన సహజ ఇంధన సరఫరాలు పడిపోయాయి. దీని వల్ల ఎరువుల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఫెర్టిలైజర్ ఉత్పత్తికి సంబంధించిన ఇన్‌పుట్స్ అన్నీ హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారానే ఇండియాకు వస్తుంటాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడి చేయడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. ప్రపం చానికి అవసరమైన ఎరువుల్లో మూడో వంతు హోర్ముజ్ జలసంధి మార్గంలోనే వెళ్తుంటాయి. ఎరువులకు చెందిన ముడిసరుకుల సరఫరా దెబ్బతినడంతో దాని వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార ఉత్పత్తిలో కూడా అసమతుల్యత నెలకొంది. 140కోట్ల భారతీయ జనాభాకు వ్యవసా యమే ముఖ్యమైంది. సుమారు 45 శాతం దేశ ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడుతారు. ఇక ఆహార ధాన్యాల ఉత్పత్తిలో యూరియాను అధికంగావాడుతున్నారు. ప్రస్తుతం ఇరాన్ వార్‌లో యూరియా ఉత్పత్తి పడిపోవడం, ఫలితంగా ఎరువుల ఉత్పత్తి తగ్గడం.. ఆ ప్రభావం భారతీయ వ్యవ సాయ రంగాన్ని క్షీణింపచేసే అవకాశాలు ఉన్నాయి. ఫెర్టిలై జర్ల ఉత్పత్తి 24.6 శాతం పడిపోయినట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది.




## పోస్టల్ వార్షిక రాబడి 15,296 కోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** కేంద్రంపరిధిలోని పోస్టల్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం భారీగా పెరిగింది. వార్షిక ఆదాయం16శాతంపెరిగి రూ.15,296 కోట్లుగా నమోదైంది. 2024-25ఆర్థిక సంవత్సరంలో రూ. 13,218 కోట్ల ఆదాయం ఉండేది. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో మొత్తం 23 సర్కిళ్లలో 8 సర్కిళ్లు తమ టార్గెట్‌లో 90 శాతం వరకు సాధించాయని చెప్పుకొచ్చారు. మిగతా 14 సర్కిల్స్ 80 90 శాతం వరకు లక్ష్యాల్ని చేరుకున్నాయని వివరించారు. ఒకటే సర్కిల్ టార్గెట్‌లో 80 శాతానికి లోపు పరిమితమైందని అన్నారు. తన సేవల్ని మరింత సమర్థవంతంగా, వేగంగా అందించేందుకు ఇంకా ఆదాయాన్ని పెంచుకునేందుకు పోస్టల్ కార్యకలాపాల్ని 6ప్రధాన విభాగాలుగా విభజించింది. ఉత్తరాలు, పత్రాలు, సాధారణ తపాలా సేవలు, పార్శిల్స్ ప్యాకేజీలు, కొరియర్ సేవల్ని వేగంగా డెలివరీ చేయడం, అంతర్జాతీయ వ్యాపారం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్లు, సుకన్య సమృద్ధి, పీపీఎఫ్, టైమ్ డిపాజిట్ వంటి పథకాలు సహా సిటిజెన్ సెంట్రిక్ సర్వీసులు ఆధార్ నమోదు, పాస్‌పోర్ట్ సేవలు, బిల్ పేమెంట్స్ ఉన్నాయి. పార్శిళ్ల విభాగంలో ఆదాయం 1133 కోట్లు వచ్చింది. ముందు ఏడాదితో పోలిస్తే69శాతం పెరిగింది. గుజరాత్, ఝార్ఖండ్, తెలంగాణలో వీటికి మంచి డిమాండ్ ఉందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. మెయిల్స్ విభాగంలో 3,202 కోట్ల ఆదాయం వచ్చింది. ఇంటర్నేషనల్ మెయిల్ కేటగిరీ ప్రపంచవ్యాప్తంగా అంతరాయాల కారణంతో పలు సమస్యల్ని ఎదుర్కొంది. ఇక్కడ ఆదాయం864 కోట్లుగా నమోదైంది. పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ విభాగం అత్యధికంగా 13శాతంపెరిగి రూ.7,756కోట్ల ఆదాయం సాధించింది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అండ్ రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆదాయం 1458 కోట్లుగా ఉంది. ఇది 25 శాతం పెరిగింది.

## చిన్నబ్యాంకుల్లోనే డిపాజిట్లపై ఎక్కువ వడ్డీరేట్లు

**ముంబయి, ఏప్రిల్ 21:** సీనియర్ సిటిజన్లకు 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు ఆకర్షణీ యంగా ఉన్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8 శాతం వరకు అత్యధిక రాబడిని అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు కొంత తక్కువ రేట్లతో విశ్వసనీ యతను అందిస్తున్నాయి. స్థిరమైన ఆదాయం, మూలధన భద్రత కోరుకునే సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇప్పటికీ నమ్మకమైన పెట్టుబడిగా నిలుస్తున్నాయి. 3సంవత్సరాల కాలపరిమితి గల ఎఫ్‌డీ లపై బ్యాంకులు అందిస్తున్న వడ్డీరేట్లు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ల విభాగంలో జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ చెరో 8 శాతం వడ్డీతో అగ్రస్థానంలో నిలిచాయి. సీనియర్ సిటిజన్లకు అత్యధికరాబడిని అందిస్తున్నాయి. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.70 శాతం వడ్డీ ఇవ్వగా, ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.60 శాతం రేటుతో కొనసాగు తోంది. ఈ విభాగంలో అధిక రాబడి ఉన్నప్పటికీ, పెట్టుబడిదారులు బ్యాంక్ విశ్వసనీయతను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో బంధన్ బ్యాంక్, ఎస్ బ్యాంక్ చెరో 7.75 శాతం వడ్డీతో ముందంజలో ఉన్నాయి. అలాగే ఆర్బీఎల్ బ్యాంక్ 7.70 శాతం, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ 7.50 శాతం వంటి రేట్లు అందిస్తున్నాయి. పెద్ద బ్యాంకులైన హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ మాత్రం సుమారు 6.95 శాతం వరకు మాత్రమే వడ్డీ అందిస్తున్నాయి.

## ఆంత్రోపిక్‌లో అమెజాన్ 2 లక్షల కోట్ల పెట్టుబడి




**ముంబయి, ఏప్రిల్ 21:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో మరో భారీ డీల్ వెలుగులోకి వచ్చింది. ప్రముఖ ఇకామర్స్, క్లౌడ్ దిగ్గజం అమెజాన్, ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్‌లో ఏకంగా 25 బిలియన్ డాలర్ల అంటే మనకరెన్సీలో సుమారు రూ.2.10లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందంతో ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం జరుగుతున్న పోటీ మరింత ముదిరింది. అమెజాన్ ప్రస్తుతం 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుండగా, భవిష్యత్తు స్థితిని బట్టి మరో 20 బిలియన్ డాలర్లు అందించనుంది. అమెజాన్ పెట్టిన 8 బిలియన్ డాలర్ల పెట్టు బడికి ఇది అదనం. దీనికి ప్రతిగా ఆంత్రోపిక్ సంస్థ రాబోయే పదేళ్లలో అమెజాన్ క్లౌడ్ టెక్నాలజీస్‌పై 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఖర్చు చేయాలని నిర్ణయించుకుంది. ఆంత్రోపిక్ తన తదుపరి ఏఐ మోడల్స్ శిక్షణ కోసం అమెజాన్ స్వయంగా తయారు చేసిన ట్రైనియంచిప్స్‌ను ఉపయోగించనుంది. అమెజాన్ తన సొంత ఏఐ మోడల్స్ తో పెద్దగా గుర్తింపు పొందలేకపోయినా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ (క్లౌడ్ సేవలు) పరంగా తిరుగులేని శక్తిగా ఎదగాలని చూస్తోంది.



## యాపిల్ సిఇఒగా జాన్ టెర్నస్

**సియాటెల్, ఏప్రిల్ 21:** టెక్ దిగ్గజం ఆపిల్‌లో కీలక మార్పులు జరిగాయి. 15 ఏళ్లుగా కంపెనీ సీఈవోగా వ్యవహరిస్తున్న టిమ్ కుక్ తన పదవి నుంచి తప్పుకుంటున్నట్టు సంస్థ ప్రకటించింది. ఆయన స్థానంలో కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈవో) జాన్ టెర్నస్‌ను నియమించింది. ఈ మార్పులు ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. సీఈవో పదవి నుంచి వైదొలగినప్పటికీ, టిమ్ కుక్ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సేవలు అందించనున్నారు. 50 ఏళ్ల జాన్ టెర్నస్ గత 25 ఏళ్లుగా ఆపిల్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. 2001లో కంపెనీలో చేరిన ఆయన, ప్రస్తుతం హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

మ్యాక్స్, ఐప్యాడ్స్, ఎయిర్‌పాడ్స్ వంటి విజయవంతమైన ఉత్పత్తుల రూపకల్పనలో టెర్నస్ తెరవెనుక కీలక పాత్ర పోషించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఎన్విడియా, మెటా వంటి సంస్థల నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతున్న తరుణంలో ఈ నాయకత్వ మార్పు ప్రాధాన్యం సంత రించుకుంది. ఐఫోన్లలో ఏఐని మరింత సమర్థంగా చేయడంతో పాటు, ఫోల్డబుల్ ఫోన్లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి కొత్త తరం ఉత్పత్తులపై టెర్నస్ దృష్టి సారిస్తారని అంచనా. ఆపిల్ తన సిరి కోసం గూగుల్ జెమినీ ఏఐ మోడల్‌ను వినియోగించుకునేందుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. 2011లో స్టీవ్ జాబ్స్ అనారోగ్యంతో తప్పుకున్న తర్వాత టిమ్ కుక్ ఆపిల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టి తన హయాంలో కంపెనీ మార్కెట్ విలువ 3.6 ట్రిలియన్ డాలర్లకు పైగా పెంచారు. తాజా మార్పుల్లో భాగంగా, జానీ స్రొజీని చీఫ్ హార్డ్‌వేర్ ఆఫీసర్‌గా నియమించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14